

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 21-05-2025 | సంపుటి - 24 | సంచిక - 19 | రూ : 4 | పేజీలు: 8


## దుర్బలులపై శ్రద్ధ చూపితేనే..
# ప్రపంచ ఆరోగ్యం సాధ్యం

- జెనీవా సదస్సును ఉద్దేశించి మోదీ వీడియో సందేశం

**మే 20, దిల్లీ:** ప్రపంచ ఆరోగ్యం అత్యంత దుర్బలులపై మనం చూపే శ్రద్ధపైన ఆధారపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆరోగ్యకరమైన భావి ప్రపంచం కలుపుకొనిపోవడం, సమగ్ర దృష్టి, సహకారంతోనే సాధ్యమని చెప్పారు. నేడు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లకు భారతదేశ విధానాలు

తరువాయి 2లో





# విచారణకు రండి...

- కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ పిలుపు
- జూన్ 5న రావాలంటూ నోటీసు పంపిన జస్టిస్ పీసీ ఘోష్
- 6న హరీశ్‌రావు, 9న ఈటల రాజేందర్ హాజరుకావాలంటూ సమాచారం
- మాజీ సీఎంతో భేటీ

**మే 20, హైదరాబాద్:** విచారణకు రావాలంటూ తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసు జారీ చేసింది. జూన్ 5న కమిషన్‌కు రావాలని కోరింది. కేసీఆర్‌తోపాటు అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావును అదే నెల 6న, ఆ సమయంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్‌ను 9న హాజరు కావాలని సమాచారం ఇచ్చింది. ఈ మేరకు 'కాళేశ్వరం'పై న్యాయ విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ మంగళవారం నోటీసులు పంపారు. జూన్ 5న బూర్గుల రామకృష్ణారావు భవనంలోని ఎనిమిదో అంతస్తులో ఉన్న కాళేశ్వరం కమిషన్ కార్యాలయానికి కేసీఆర్ వెళ్లాల్సి ఉంటుంది.

### అఫిడవిట్లు, క్రాస్ ఎగ్జామినేషన్లలో అంశాల ఆధారంగానే...

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ 2023 అక్టోబరులో కుంగడం, తరువాయి 2లో

## భక్తులకు తక్కువ ధరకే
# నాణ్యమైన ఆహారం

- డ్రోన్ల నియంత్రణ.. స్విమ్స్‌కు అదనంగా రూ.71 కోట్లు
- తితిదే ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు

**మే 20, తిరుపతి:** తిరుమల తిరుపతి దేవస్థానానికి ఎక్కువ ఆదాయమిచ్చే వ్యక్తులు, సంస్థలకు గతంలో బిగ్ క్యాంటీన్లు, జనతా క్యాంటీన్ల కాంట్రాక్టు అప్పగించారు. వారు భక్తుల నుంచి అధిక ధరలు వసూలుచేసి నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారని తితిదే ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో యాత్రికులకు తక్కువ ధరకే మంచి ఆహారం లభించేలా చర్యలు చేపట్టనున్నామని వివరించారు. ప్రస్తుతం ఆయా సంస్థలు నిర్వహిస్తున్న హోటళ్లకు ఓ బృందం వెళ్లి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశాకే అనుమతుల ప్రక్రియ

తరువాయి 2లో



## ఏపీలో నేడు పలు జిల్లాలకు
# అతి భారీ వర్ష సూచన

విశాఖపట్నం: 'నైరుతి' రుతు పవనాలు ఈ నెల 23 లేదా 24 నాటికి కేరళలోకి ప్రవేశించడానికి పరిస్థితులు అత్యంత అనుకూలంగా మారుతున్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం వెల్లడించింది. ఈ నెల 26 నాటికి రాయలసీమ మీదుగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

### 2009 తర్వాత ఇప్పుడే

గత ఏడాది రుతుపవనాలు సాధారణం (జూన్ 1) కంటే రెండు రోజులు ముందుగా మే 30న కేరళను తాకాయి. అదేరోజు తమిళనాడులోని కొన్ని ప్రాంతాలు, బంగాళాఖాతం మీదుగా ఈశాన్య రాష్ట్రాలకూ విస్తరించాయి. కేరళ తీరం, ఈశాన్య ప్రాంతాలను ఒకేసారి

తరువాయి 2లో





## సైనిక దుస్తుల్లో
# ఉగ్రవాదులు

- కశ్మీర్‌లో స్థానికులకు కొత్త చిక్కులు

**మే 20:** పహల్గాం ఉగ్రదాడితో వణికిపోయిన జమ్మూకశ్మీర్ ప్రజలను ఇప్పుడు మరో సమస్య వెంటాడుతోంది. ఉగ్రవాదులు సైనిక దుస్తులు ధరించి సంచరిస్తుండటంతో స్థానికులకు కొత్త సమస్య ఎదురవుతోంది. భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య తేడాను గుర్తించలేక అయోమయానికి గురవుతున్నారు. అటు భద్రతా సిబ్బందికి ఉన్న ముప్పును పసిగట్టడంలోనూ ఇబ్బంది ఎదురవుతోంది. పహల్గాం దాడి నాటి నుంచి ఈ తరహా ఘటనలు పెరగడం ఆందోళనకరంగా మారింది. ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యాటకులపై

తరువాయి 2లో

# ఉగ్రసంస్థల 'లాంతర్' తంత్రం

- విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులతో యువతను ఆకర్షించేందుకు కుట్ర
- సికింద్రాబాద్, విజయనగరం నిందితుల విచారణలో వెలుగులోకి

**మే 20: హైదరాబాద్:** ఉగ్ర సంస్థలు సామాజిక మాధ్యమాల ద్వారా యువతలో విద్వేషాలు రెచ్చగొట్టి దేశంలో తమ కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నాయి. సున్నిత మనస్కులను తమ భావజాలానికి ఆకర్షితులయ్యేలా చేసి ఉగ్రచర్యలకు పాల్పడేలా ప్రేరేపిస్తున్నాయి. ఇందు కోసం 'మ్యాజిక్ లాంతర్' అనే కొత్త పంథాను అనుసరిస్తున్నట్లు ఇటీవల పట్టుబడిన యువకుల విచారణలో దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఓ వర్గానికి సంబంధించిన అంశాలపై పోస్టులు పెడుతూ వాటికి స్పందించే వారిని గుర్తించి తమ వలలో వేసుకుంటున్నారని తేల్చాయి. ఈ మ్యాజిక్ లాంతర్ ప్రక్రియ ఎలా సాగుతుందంటే. మొదట ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్.. తదితర యాప్‌లలో ఉగ్ర సంస్థల హ్యాండ్లర్లు.. దేశంలో ఒక వర్గానికి అన్యాయం జరుగుతోందని, దాన్ని ఎదుర్కోవాలని



పోస్టులు పెడతారు. వీటికి అనుకూలంగా తరువాయి 2లో

# ఉగ్రజాడలా.. ఊడలా?




- నగరంలో నిఘా వర్గాల జల్లెడ
- వరుస ఘటనలతో పోలీసు యంత్రాంగం అప్రమత్తం

**మే 20, హైదరాబాద్:** హైదరాబాద్: నగరంలో మరోసారి ఉగ్రజాడలు కలకలం రేపుతున్నాయి. రెండ్రోజుల కిందట సికింద్రాబాద్ బోయగూడలో సమీర్ అనే యువకుడిని విజయనగరం పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఉలికిపాటుకు గురిచేసింది. పాకిస్థాన్ నిఘా వర్గాలకు మనదేశ రక్షణ సమాచారాన్ని చేరవేసిందనే ఆరోపణలు ఎదుర్కొంటున్న యూ ట్యూబర్ జ్యోతిమల్హోత్రా సైతం

తరువాయి 2లో

## ధరల పర్యవేక్షణకు
# మంత్రుల కమిటీ...

- అవసరమైతే నల్ల బర్లీ పొగాకును ప్రభుత్వమే కొంటుంది
- గిట్టుబాటులేక విలవిల్లాడుతున్న రైతులను ఆదుకుంటాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ
- మద్యం కుంభకోణంపై మంత్రులెవరూ బయట మాట్లాడవద్దని ఆదేశం
- దోషులెవర్నీ వదిలిపెట్టబోమని స్పష్టీకరణ



2లో

# 'పొగ' బట్టిన మృత్యువు

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయడం తెలిసిందే. 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్ కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో పాలుపంచుకొన్న వివిధ విభాగాల ఇంజినీర్లు, నిర్మాణ సంస్థలు, ఆర్థిక, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులు, పే అండ్ అకౌంట్స్ అధికారులను విచారించింది. కొందరు స్వచ్ఛందంగానూ కమిషన్ ఎదుట హాజరయ్యారు. అందరి నుంచి అఫిడవిట్లను తీసుకొని, క్రాస్ ఎగ్జామిన్ చేశారు. వాటిలో వచ్చిన అంశాల ఆధారంగా ప్రస్తుతం కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను పిలిచినట్లు స్పష్టమవుతోంది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో తీసుకొన్న నిర్ణయాల ప్రకారమే తాము ముందుకెళ్లినట్లు పలువురు విచారణలో పేర్కొన్నారు. ఇంజినీర్లు చెప్పిన, ఇచ్చిన రికార్డులను నిర్ధారించుకోవడానికి, వివిధ అంశాలపై కేసీఆర్ అభిప్రాయాలను తెలుసుకోవడానికి హాజరు కావాలని కోరినట్లు సంబంధితవర్గాలు తెలిపాయి. కమిషన్ విచారణ దాదాపు పూర్తయిన దశలో కేసీఆర్‌ను పిలవడం ప్రాధాన్యాన్ని సంతరించుకొంది. కాళేశ్వరం నిర్మాణ సమయంలో హరీశ్‌రావు నీటిపారుదలకు, ఈటల రాజేందర్ ఆర్థిక శాఖకు మంత్రులుగా ఉన్నారు. ప్రాజెక్టుకు రుణం తీసుకొనేందుకు ఏర్పాటు చేసిన కార్పొరేషన్, మేడిగడ్డ బ్యారేజీలో అదనపు పనుల అప్పగింత తదితర అంశాలపై వీరి నుంచి వివరాలను కోరే అవకాశముంది. అధిక సంఖ్యలో ఇంజినీర్లను, అధికారులను, నిర్మాణ సంస్థలను విచారించాల్సి రావడంతో కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం ఏడుసార్లు పొడిగించింది. ఈ నెలాఖరుతో కమిషన్ గడువు ముగియనుండటంతో కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను పిలవకుండానే తుది నివేదిక ఇస్తారనే ప్రచారం జరిగింది. అయితే విచారణలో ఇంజినీర్లు చెప్పిన, రాతపూర్వకంగా ఇచ్చిన అఫిడవిట్ల ఆధారంగా వీరితో మాట్లాడకుండా తుది నివేదిక ఇవ్వరాదని కమిషన్ భావించడంతో మరో రెండు నెలలు సమయం ఇచ్చి జులై ఆఖరు వరకు గడువు పెంచుతూ సోమవారం సర్కారు ఆదేశాలు జారీ చేసింది. సోమవారమే ముగ్గురికీ నోటీసులు ఇవ్వాలని కీలక నిర్ణయం తీసుకొన్న కమిషన్, మంగళవారం పంపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

**కేసీఆర్‌తో హరీశ్‌రావు భేటీ**

ఎర్రవల్లిలోని నివాసంలో భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు కలిశారు. కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో... వారి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. కమిషన్ నోటీసులపై కేసీఆర్‌తో హరీశ్‌రావు చర్చించినట్లుగా తెలిసింది. కమిషన్ ఎదుట హాజరవడానికి ఇంకా సమయం ఉండడంతో... ఈ అంశంపై మరోసారి చర్చిద్దామని కేసీఆర్ సూచించినట్లు సమాచారం. కమిషన్ ఎదుట హాజరుకు కేసీఆర్‌కు, హరీశ్‌రావుకు తేదీలను వేర్వేరుగా ఖరారు చేయడంతో అందుకు తగ్గట్టుగానే కమిషన్ ఎదుట వాంగ్మూలం ఇచ్చేందుకు త్వరలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్లు తెలిసింది.

## దుర్బలులపై శ్రద్ధ చూపితేనే.. ప్రపంచ ఆరోగ్యం సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

స్థిరమైన ప్రత్యామ్నాయ నమూనాలు చూపగలవన్నారు. జెనీవాలో జరుగుతున్న 78వ 'ప్రపంచ ఆరోగ్యసభ' సదస్సును ఉద్దేశించి మంగళవారం వీడియో సందేశం ద్వారా ప్రధాని మాట్లాడారు. ఈ ఏడాది ఇతివృత్తమైన 'ఆరోగ్యం కోసం ఒకటే ప్రపంచం' గురించి చెబుతూ ఇది ప్రపంచం పట్ల భారతదేశ దార్శనికతకు అనుగుణంగా ఉందన్నారు. భారతదేశ ఆరోగ్య సంస్కరణల్లో కలుపుకొనిపోవడం ప్రధానమైనదిగా పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్యబీమా పథకం 'ఆయుష్మాన్ భారత్' 58 కోట్లమందికి ఉచిత చికిత్సలు అందుతున్నట్లు తెలిపారు. 70 ఏళ్లు దాటిన భారతీయులు అందరికీ వర్తించేలా ఇటీవలే దీన్ని విస్తరించామన్నారు. భారత్‌లో వేలాది ఆరోగ్య, వెల్‌నెస్ కేంద్రాల విస్తృత నెట్‌వర్క్ ఉందని.. క్యాన్సర్, మధుమేహం, అధిక రక్తపోటు వంటి రుగ్మతలను ముందస్తు పరీక్షల ద్వారా గుర్తించడానికి ఇవి దోహదపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే వేలాది ప్రభుత్వ ఫార్మసీలు తక్కువ ధరకు నాణ్యమైన మందులు అందిస్తున్నట్లుగా నొక్కి చెప్పారు. ఆరోగ్య వసతులను మెరుగుపరచడంలో సాంకేతికత పాత్ర గురించి చెబుతూ గర్భిణులు, పిల్లలకు టీకాలు వేయడంలో ఉపయోగపడుతున్న ప్రత్యేక డిజిటల్ ఆరోగ్య గుర్తింపు వ్యవస్థను వివరించారు. టెలీ మెడిసిన్ అనేది ఇపుడు వైద్యులకు అందరినీ చేరువ చేసిందన్నారు. భారత ఉచిత టెలీ మెడిసిన్ సేవల ద్వారా 34 కోట్ల సంప్రదింపులు జరిగినట్లుగా తెలిపారు. జూన్ నెలలో రాబోతున్న 11వ 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'ను గుర్తుచేస్తూ ఈ ఏడాది 'ఒకే భూమి, ఒకే ఆరోగ్యసమాజం కోసం యోగా' పేరుతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రపంచ దేశాలన్నీ పాల్గొనాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

## ఉగ్రజాడలా.. ఊడలా?

(మొదటిపేజీ తరువాయి)

వందేభారత్ ప్రారంభోత్సవ సమయంలో నగరానికి వచ్చిందని, ఆ సమయంలో ఇక్కడ కొంతమందిని కలిసిందనే ప్రచారం జరుగుతుండటంతో పోలీసులు ఆవైపుగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన పహల్గాం దాడి, తాజాగా జరిగిన ఘటనల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు.

**అక్రమ వలసదారులపై కన్ను**

అక్రమంగా నివాసం ఉంటున్న 100 మంది బంగ్లాదేశీయులను 4 నెలల వ్యవధిలో పట్టుకున్నారు. నకిలీ ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులతో నగర పౌరులుగా చెలామణి అవుతున్నట్టు గుర్తించిన కొందరిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. వారికి సహకరించిన వ్యక్తుల వివరాలు రాబడుతున్నట్టు సమాచారం. అక్రమంగా ఉన్న విదేశీయులను గుర్తించి పంపివేయాలంటూ తాజాగా సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చింది. కేంద్ర నిఘా వర్గాలు కూడా ఉగ్ర కార్యకలాపాలపై హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో రాజధాని పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఖైరతాబాద్, సనత్‌నగర్, జవహర్‌నగర్, అంబర్‌పేట్ ప్రాంతాల్లో 15 మంది విదేశీయులను గుర్తించినట్టు సమాచారం.

**మారుపేర్లతో చెలామణి**

బంగ్లాదేశ్ నుంచి కొందరు అక్రమంగా పశ్చిమబెంగాల్ మీదుగా నగరానికి చేరినట్టు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే చాలామందిని అదుపులోకి తీసుకున్నా ఇంకొందరు జనావాసాల మధ్య ఉంటున్నట్టు భావిస్తున్నారు. వీరంతా కోల్‌కతాలో దళారుల నుంచి అక్కడి ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు పొందారు. నగరం వచ్చాక వాటి వివరాలతో ఆధార్ చిరునామా మార్చుకుంటున్నారు. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో 5200 మంది రోహింగ్యాలు నివాసం ఉంటున్నట్టు నిర్ధారించారు.

## సైనిక దుస్తుల్లో ఉగ్రవాదులు

(మొదటిపేజీ తరువాయి)


ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఆ రోజు కాల్పులు జరిపిన దుండగులు సైనిక దుస్తుల్లో వచ్చారని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. దీంతో ఆ దిశగా భద్రతా బలగాలు దర్యాప్తు చేపట్టాయి. ఆ తర్వాత కూడా ఉగ్రవాదులు అదే పంథా కొనసాగిస్తున్నట్లు భద్రతా సిబ్బంది గుర్తించారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో కనిపించినట్లు సమాచారం.

**ముష్కరులను పాక్ అప్పగించాల్సిందే..**

టెల్ అవీవ్: ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలు ఏకం కావాలని ఇజ్రాయెల్‌లోని భారత రాయబారి జేపీ సింగ్ పిలుపునిచ్చారు. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ విజయవంతంగా ''ఆపరేషన్ సిందూర్'' నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనిపై భారత రాయబారి మాట్లాడుతూ.. అమెరికా తరహాలోనే పాకిస్థాన్ కూడా ఉగ్రవాదులను అప్పగించాలన్నారు. ఒక ఇజ్రాయెలీ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత్ పాక్‌కు నీటిని అందిస్తే.. వారు మా దేశంపై ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్నారు. రక్తం, నీరు కలిసి ప్రవహించలేవని భారత ప్రధాని మోదీ ఇప్పటికే స్పష్టం చేశారు. అందుకే సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేశాం' అని సింగ్ పేర్కొన్నారు.

## పాక్ సైనిక ప్రధానాధికారికి పదోన్నతి

* **ఫీల్డ్ మార్షల్‌గా అసీమ్ మునీర్**



ఇస్లామాబాద్: పాకిస్థాన్ ప్రభుత్వం తన సైనిక బలగాల ప్రధానాధికారి అసీమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించాలని మంగళవారం నిర్ణయించింది. దీంతో మునీర్ పాకిస్థాన్ చరిత్రలో ఆ స్థాయి పొందిన రెండో వ్యక్తి అయ్యారు. భారత్‌తో ఇటీవల జరిగిన సైనిక సంఘర్షణలో కీలక పాత్ర పోషించిన కారణంగా ఆయనకు పదోన్నతి కల్పించినట్టు పాక్ ప్రభుత్వం ప్రకటించింది. ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని అధికారిక ప్రకటన తెలియజేసింది. ధైర్యంతో కూడుకున్న నాయకత్వాన్ని, అత్యున్నత వ్యూహాలను ప్రదర్శించడం ద్వారా శత్రువును ఓడించి దేశ భద్రతకు పాటుపడినందుకు జనరల్ అసీమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్ స్థాయి కల్పించాలని పాకిస్థాన్ ప్రభుత్వం నిర్ణయించింది'' అని ఆ ప్రకటన తెలియజేసింది.

## ధరల పర్యవేక్షణకు మంత్రుల కమిటీ

అమరావతి: పంటలకు ధరల్లేక ఇబ్బంది పడుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. వ్యవసాయ దిగుబడులు, గిట్టుబాటు ధరలు, నిత్యావసరాల ధరలపై ఆరుగురు మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తున్నట్టు ప్రకటించారు. నల్ల బర్లీ పొగాకును వీలైనంత వరకు వ్యాపారులతో ప్రభుత్వం కొనిపిస్తుందని, అవసరమైతే ప్రభుత్వమే కొంటుందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం మంత్రివర్గ సమావేశంలో వ్యవసాయరంగ సమస్యలు, అన్నదాతల కష్టాలు, పంటల మార్కెటింగ్‌లో ఇబ్బందులపై సుమారు 45 నిమిషాలు చర్చించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి పంటల దిగుబడులు పెరిగాయని అధికారులు వివరించారు. అంతర్జాతీయ పరిణామాలు, దేశవిదేశాల్లో పరిస్థితులు పంటల ధరలపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో మిర్చి, పొగాకు, కోకో, చెరకు, మామిడితో పాటు, ఆక్వా ఉత్పత్తుల ధరలు తగ్గడానికి కారణాల్ని వివరించారు. ధరల విషయంలో రైతులకు ఇబ్బంది తలెత్తకుండా చూస్తామని, వారికి సాంత్వన చేకూరేలా, క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా ప్రభుత్వచర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి ప్రకటించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రివర్గ ఉపసంఘం నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు లాంటి ఎన్నికల హామీలపై, కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలోకి తీసుకురావడం లాంటి ఎన్నికల హామీల సాధ్యాసాధ్యాలపై త్వరలో నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై మంత్రివర్గ ఉపసంఘంలో జనసేన, భాజపాల నుంచి మంత్రుల్ని సభ్యులుగా నియమించి... ఆ కమిటీకి ఈ బాధ్యత అప్పగించాలన్నారు.

**మంత్రులెవరూ మాట్లాడొద్దు**

వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై సిట్ దర్యాప్తు జరుగుతున్నందున మంత్రులెవరూ దీనిపై బయట మాట్లాడవద్దని, మీడియా ప్రతినిధులు అడిగినా స్పందించవద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ''మద్యం కుంభకోణంపై దర్యాప్తు సంస్థలు నిష్పాక్షికంగా, స్వతంత్రంగా, ఒక పద్ధతి ప్రకారం దర్యాప్తు చేస్తున్నాయి. తప్పు చేసినవాళ్లు ఎంతటివారైనా వదిలే ప్రసక్తి లేదు. దర్యాప్తు జరుగుతున్నప్పుడు మంత్రులు స్పందిస్తే... దర్యాప్తును ప్రభావితం చేస్తున్నారన్న భావన కలిగే అవకాశం ఉంది. మద్యం కుంభకోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థలూ దృష్టిపెట్టాయి. తప్పు చేసినవారు తప్పించుకోరాదన్న విధానంలోనే కేంద్ర, రాష్ట్రాల్లో కూటమి పాలన సాగుతోంది'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

**శ్రీశైలాన్ని అభివృద్ధి చేద్దాం**

రాష్ట్రంలో ఎక్కువ సంఖ్యలో భక్తులు సందర్శించే, అత్యధిక ఆదాయం వచ్చే దేవాలయాల్లో శ్రీశైలం రెండో స్థానంలో ఉందని, భక్తులకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పిస్తూ ఆ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. అక్కడ భూముల సమస్యల్ని అటవీ, రెవెన్యూశాఖలు, అవసరమైతే కేంద్రంతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని తెలిపారు. శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై తరచూ ట్రాఫిక్‌జామ్‌తో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో జంతుప్రదర్శన శాలలు ఏర్పాటుచేసే అంశాన్నీ పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

**ప్రతి జిల్లాలో ఒక యూనివర్సిటీ**

రాష్ట్రంలో ప్రతి జిల్లాలో కచ్చితంగా ఒక యూనివర్సిటీ అయినా ఉండాలని సీఎం తెలిపారు. ప్రస్తుతం ఏడు జిల్లాల్లో యూనివర్సిటీలు లేవన్నారు. దీనిపై చర్చ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ... నూజివీడులో స్థలం ఉందని, అక్కడ యూనివర్సిటీ ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. జిల్లా కేంద్రాల్లో ఉంటేనే అందరికీ అనుకూలమని, తమ ప్రాంతాల్లోనే యూనివర్సిటీలు రావాలని ప్రజా ప్రతినిధులు ఆలోచించడం సరికాదని సీఎం పేర్కొన్నారు.

**వంటగ్యాస్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎంతమంది టీ తాగారు?**

రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎంతమంది మంత్రులు క్షేత్ర పర్యటనల్లో భాగంగా ఉచిత వంటగ్యాస్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి.. టీ అడిగి తాగారని ఆయన ప్రశ్నించారు. మంత్రులెవరూ వెళ్లలేదని తెలుసుకుని ఆయన కొంత అసంతృప్తి వ్యక్తంచేశారు.

## భక్తులకు తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈవో శ్యామలరావు నిర్ణయాలు వెల్లడించారు. తిరుచానూరు శ్రీపద్మావతి, నారాయణవనం ఆలయం, కపిలతీర్థం, నాగాలాపురం దేవస్థానం, ఒంటిమిట్ట రామాలయం, అమరావతి శ్రీవారి ఆలయాల సమగ్రాభివృద్ధికి నిర్ణయం. ఒంటిమిట్టలో అన్నదానం సేవలు మెరుగు. తుళ్లూరు మండలం అనంతవరం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి రూ.10 కోట్లు. ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాల అభివృద్ధి. ఇజ్రాయెల్ సాంకేతికతతో యాంటీడ్రోన్ వ్యవస్థ. స్విమ్స్‌లో అంతర్జాతీయ సేవల కోసం విశ్రాంత ఐఏఎస్ ఐవీ సుబ్బారావు నేతృత్వంలో కమిటీ సిఫార్సుల మేరకు 597 పోస్టులు మంజూరు, న్యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల్లో వైద్యుల సంఖ్య రెట్టింపు. డీడీ నెక్స్ట్ చిత్రబృందానికి కాపీరైట్ అతిక్రమణ నోటీసులు జారీ. తిరుమలలోని పచ్చదనాన్ని 80 శాతానికి పెంచేందుకు నాలుగేళ్లలో అటవీ శాఖకు రూ.4 కోట్ల కేటాయింపు. ఉద్యోగులకు పదోన్నతులు, గోశాలలో ఆవుల రక్షణ, శ్రీవారి మెట్టుమార్గంలో రవాణాకు శాశ్వత పరిష్కారం, వీఆర్ఎస్ తీసుకునే అన్యమత ఉద్యోగులకు అదనంగా రూ.5 లక్షల చెల్లింపు.

## ఉగ్రసంస్థల 'లాంతర్' తంత్రం

(మొదటిపేజీ తరువాయి)

స్పందించే యువత సామాజిక మాధ్యమ ఖాతాలపై నిఘా పెడతారు. ఓ వర్గానికి సంబంధించిన పోస్టులపై వారి స్పందనలను ఆరా చేస్తారు. సాధారణంగా స్పందించే వారిని కాకుండా.. ఆవేశపూరితంగా మాట్లాడే వారిని ఎంపిక చేసి తమ జాబితాలో చేర్చుకుంటారు. తరువాత నుంచి వారి ఖాతాలకు నేరుగా పోస్టులు పెడతారు. ఆ వర్గంపై అన్యాయం జరుగుతోందంటూ తీవ్రమైన సందేశాలు పంపి వారిలో విద్వేషం రగిలిస్తారు. తమ ఉగ్ర కార్యకలాపాలకు సహకరిస్తారనే నమ్మకం కుదిరితే తమ సంస్థ సానుభూతిపరులతో పరిచయం చేయించి తరచూ సమావేశాలకు పిలుస్తారు. అక్కడ ఉగ్రసంస్థ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ప్రోత్సహిస్తారు.

**ఇదే విధంగా 'అహిం' కుట్రదారుల ఎంపిక**

తాజాగా పోలీసులు అరెస్టు చేసిన సికింద్రాబాద్, ఏపీలోని విజయనగరం ప్రాంతాలకు చెందిన యువకులను ఉగ్ర సంస్థ హ్యాండ్లర్ మ్యాజిక్ లాంతర్ ద్వారానే ఎంపిక చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అనంతరం వీరితోనే 'అల్ హింద్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(అహిం)' అనే సంస్థను స్థాపించేలా చేసినట్లు గుర్తించారు. వీరి హ్యాండ్లర్ బాంబు తయారీకి సంబంధించి అంశాల గురించి ఓ పీడీఎఫ్ ఫైల్‌ను సిగ్నల్ యాప్ ద్వారా వీరికి పంపినట్లు అనుమానిస్తున్నారు. దాని ఆధారంగా తయారు చేసిన బాంబును తొలుత ప్రయోగాత్మకంగా పరిశీలించాలని ఆదేశించినట్లు తేలింది. అది విజయవంతమైతే తర్వాత జనసమ్మర్ద ప్రాంతాల్లో పేల్చాలని హ్యాండ్లర్ సూచించేవాడని వెల్లడైంది. అయితే ఈ ఉపద్రవాన్ని ముందుగానే పసిగట్టిన దర్యాప్తు సంస్థలు యువకులను అరెస్టు చేయడంతో భారీ ఉగ్రకుట్ర భగ్నమైంది. అలాగే దేశంలో సంచలనం సృష్టిస్తున్న ఐఎస్ఐ ఏజెంట్ జ్యోతి మల్హోత్రాను సైతం ఉగ్రసంస్థలు సామాజిక మాధ్యమాల ద్వారానే ట్రాప్ చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మ్యాజిక్ లాంతరు ప్రక్రియను ఉగ్రసంస్థలు విస్తృతంగా వినియోగిస్తున్న నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు అప్రమత్తమయ్యాయి.

## గాజాపై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్

* **తాజా దాడుల్లో 85 మంది మృతి**



డెయిర్ అల్ బలా: అంతర్జాతీయంగా వస్తున్న ఆక్షేపణలను బేఖాతరు చేస్తూ గాజాపై ఇజ్రాయెల్ నిరాటంకంగా దాడులు కొనసాగిస్తూనే ఉంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ జరిపిన వైమానిక దాడుల్లో దాదాపు 85 మంది పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారు. హమాస్ చెరలో బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలను విడిపించేందుకే తాము ఈ దాడులకు పాల్పడుతున్నామని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఇజ్రాయెల్ చేపట్టిన తాజా దాడుల్లో ఇప్పటివరకూ 300 మందికి పైగా పాలస్తీనా పౌరులు మరణించారు. ఓ వైపు దాడులకు పాల్పడుతూనే మరోవైపు పరిమితంగా పాలస్తీనీయులకు ఆహారం, వైద్యం, ఇంధనం వంటి నిత్యావసరాలను అందించడానికి ఇజ్రాయెల్ అనుమతినివ్వడం గమనార్హం.

## పాక్ ప్రధాని షెహబాజ్‌కు ఆ గ్రామమంటే మమకారం

పహల్గాం ఉగ్రదాడితో భారత్‌పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమయ్యాయి. ఇరు దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న వేళ పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాకిస్థాన్‌లోని అత్యంత ధనిక కుటుంబాల్లో ఒకటైన షరీఫ్ కుటుంబం మూలాలు కశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లో ఉన్నాయి. వీరి పూర్వీకులు కశ్మీరీ పండితులని ''పాకిస్థాన్ ఎ హార్డ్ కంట్రీ'' అనే పుస్తకంలో బ్రిటిష్ రచయిత లైవెన్ అనటోల్ పేర్కొన్నారు. ఈ కుటుంబం కశ్మీర్ నుంచి అమృత్‌సర్‌కు సమీపాన ఉన్న ''జాతి ఉమ్రా'' గ్రామానికి బ్రిటిష్ హయాంలోనే తరలి వెళ్లింది. షరీఫ్ కుటుంబానికి ఈ గ్రామం అంటే ఎంతో ఇష్టమని స్థానికులు అంటున్నారు. అందుకే ఈ ఉద్రిక్తతలు తమను బాధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతి ఉమ్రా గ్రామంలో షరీఫ్ పూర్వీకులకు ఒక ''హవేలీ'' (భవంతి) ఉండేది. అది ఇప్పుడు ఒక గురుద్వారాగా మారిందని, అందులో ఉచితంగా భోజనం అందించే ఒక లంగర్ హాల్ కూడా నిర్మిస్తున్నట్లు స్థానికుడు హర్దీప్ సింగ్ తెలిపారు. ''1976లో షెహబాజ్ షరీఫ్ సోదరుడు అబ్బాస్ షరీఫ్ తమ హవేలీని మా గ్రామానికి విరాళంగా ఇచ్చారు.

# గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాద సంఘటన హైదరాబాద్ చరిత్రలోనే విషాదకరం

* అందాల పోటీల మీద పెట్టిన శ్రద్ధ.. మౌలిక సదుపాయల కల్పనపై పెడితే బాగుంటుంది
* బిఆర్ఎస్ ముస్తాబాద్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నరసింహా రెడ్డి



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాద సంఘటన హైదరాబాద్ చరిత్రలోనే విషాదకరమని బిఆర్ఎస్ ముస్తాబాద్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నరసింహా రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ ముస్తాబాద్ మండల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుల్జార్ హౌస్ గురించి తెలియని వాళ్లు హైదరాబాద్, తెలంగాణలో ఎవరూ లేరని, పాతబస్తీ అత్యధిక జనసాంద్రత ఉన్న ప్రదేశమని, ఏదైనా ప్రమాదం జరిగితే ఫైర్ ఇంజన్లు, అంబులెన్స్ లు రావడానికి కూడా వీలులేదని అన్నారు. అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు, ఫైర్ ఇంజన్‌లో నీళ్లు ఉంటే గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాదంలో ప్రాణ నష్టం తగ్గేదని, ఫైర్ బ్రి గేడ్‌కు సరైన మాస్కులు లేకపోవడంలో వాళ్లు లోపలికి వెళ్లి బాధితులను కాపాడలేకపోయారని అన్నారు. అందాల పోటీల మీద పెట్టిన శ్రద్ధ, ఇలాంటి మౌలిక సదుపాయల కల్పనపై పెడితే బాగుంటుందని అన్నారు. 125 సంవత్సరాల నుంచి చార్మినార్ దగ్గర ఉంటున్న అగర్వాల్ కుటుంబంలో 17 మంది చనిపోవడం బాధాకరమని, బాధిత కుటుంబ సభ్యులకు రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం జరగకుండ చూసుకోవాలని, ప్రభుత్వం మానవత్వంతో స్పందించాలని కోరారు.

* కాంగ్రెస్ పాలనలో అష్టకష్టాలు పడుతున్న అన్ని వర్గాలు

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలు అష్టకష్టాలు పడుతున్నాయని బిఆర్ఎస్ నాయకులు అన్నారు. ఇంకా రైతు భరోసా రాలేదని, వడ్ల కొనుగోలు పూర్తి కాలేదని, రైతుబంధు రాక, రుణమాఫీ కాక, ధాన్యం కొనుగోళ్లు జరగక రైతన్న దిగాలుగా ఉన్నాడని తెలిపారు. పథకాలు అన్నీ ఆగిపోయాయని, బతుకమ్మ చీరలు రద్దయ్యాయని, తెలంగాణ నేతన్న నిరాశగా ఉన్నాడని అన్నారు. పెన్షన్లు పెరగక, సకాలంలో రాకముసలోళ్ల నుండి వికలాంగుల దాకా ఎదురుచూపులు చూస్తున్నారని, ఇస్తానన్న 2,500, స్కూటీలు ఎగ్గొట్టడంతో రాష్ట్రంలో మహిళలు, యువకులు కోపంగా ఉన్నారని అన్నారు. 420 హామీల అమలు చేసే దాక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విడిచి పెట్టేదు లేదని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మాజీ కోఆప్షన్ మెంబర్ సర్వర్ పాషా, ముస్తాబాద్ మాజీ సర్పంచ్ నల్ల నరసయ్య, ముస్తాబాద్ బిఆర్ఎస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు రాచమడుగు సంతోష్, గూడూరి భరత్, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మేంగని మనోహర్, మాజీ మండల కోఆప్షన్ అన్వర్, ముక్క మల్లయ్య, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం స్వామి, తాళ్ల రాజు, జహంగీర్, శేఖర్ చారి తదితరులున్నారు.

## జూలై 9 సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

* సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు భూక్య రమేష్




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వం పై కార్మిక వర్గం ఐక్యంగా పోరాటం చేయాలని లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు భూక్య రమేష్ గుడెల్లి యాకయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక రుద్రంపూర్ ఏరియా జిఎం కార్యాలయం ఎదుట ప్ల కార్డ్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెరిగిన ధరలు తగ్గించాలని ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మొద్దని ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కోలిండియా వేతనాలు అమలు చేయాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని క్లక్కాడ్లు పెట్టి నిర్ణయించారు నినదించారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులతో పాటు సింగరేణి పనిచేస్తున్న ఉద్యోగస్తులు పర్మనెంట్ కార్మికులు కాంట్రాక్టు కార్మికులు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మిక వర్గం అంతా ఒక్క తాటి మీద ఉండి సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రవి కుమార్, తాండ్ర విజయ్ కుమార్, కాంట్రాక్ట్ కార్మికులు ,తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

* భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు మంగళవారం చర్ల పోలీసుల ఆధ్వర్యంలో చర్ల మండలం లోని చత్తీస్గడ్ రాష్ట్ర సరిహద్దు గ్రామమైన చెన్నాపురంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ పాల్గొని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఈ గ్రామంలో ప్రతి ఇంటిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.అనంతరం గ్రామస్తులందరితో సమావేశమై అక్కడ నివసించే మహిళలకు,చిన్న పిల్లలకు దుస్తులతో పాటు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్లను కూడా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సారధ్యంలో ఆదివాసీ ప్రజలకు విద్య,వైద్యం,రవాణా వంటి కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని,అదేవిధంగా నిషేధిత మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దని గ్రామస్తులకు సూచించారు ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజువర్మ,ఎస్సై లు కేశవ,నర్సిరెడ్డి , సి ఆర్ పి ఎఫ్ ,స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

- డి నాగారంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం
- చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించి.. అధిక దిగుబడులు పొందాలని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారంలో రైతు వేదిక వద్ద మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు అధ్యక్షతన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వద్దు వెంకటయ్య మాట్లాడుతూ సీజన్‌కు ముందే మహోత్తరమైన మంచి కార్యక్రమాన్ని చేపట్టడం చాలా మంచి పరిణామం, శాస్త్రవేత్తలే రైతుల దగ్గరికి వచ్చి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం రైతులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు గతంలో తంగేడు, జిల్లేడు ఆకులను వేసి కలియదున్ని భూసారాన్ని కాపాడుకునేవారని, ఇప్పటి పరిస్థితులుకు అనుగుణంగా జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట ఎరువులని ముందే కలియదున్ని భూసారాన్ని కాపాడాలి అని సూచించారు. అలాగే ఆయిల్ ఫామ్ సబ్సిడీని ఉపయోగించుకోవాలని సూచించారు. కలుపు మందులకు బదులుగా కలుపు తీస్తేనే రైతులకు ఉపయోగమన్నారు. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ లో భూసార పరీక్ష కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని, చౌటుప్పల్ మార్కెట్ యార్డులో రైతు బజార్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. త్వరలో ప్రతి వరి కొనుగోలు కేంద్రంకు 50టార్పాల్సిన పంపిణీ చేస్తానన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ కృష్ణ, డాక్టర్ స్పందన భట్ వ్యవసాయంలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గురించి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించే పద్ధతుల గురించి వివరించారు. తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించుట, అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం, ఎరువులు పురుగు మందులు కొన్నపుడు వాటి రశీదులను పంట కాలం పూర్తి అయ్యేవరకు భద్రపరిచుకోవాలని సూచించారు. సాగునీటిని ఆదా చేసే మార్గాలను, పంట మార్పిడి చెట్లను పెంచుట వరి, పత్తి పంటలలో తీసుకోవలసిన సస్య రక్షణ గురించి, మేలైన విత్తన వంగడాల గురించి పూర్తి సమాచారం వివరించారు. భువనగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూగర్భ జలాలు తక్కువ ఉన్నందున ఆరు తడి పంటలు, ఆయిల్ ఫామ్ పంటలు పండించడంలో అధిక లాభాలు పొందవచ్చని ప్రస్తుతం ఆయిల్ ఫామ్ ధర రూ.21వేలకు టన్ను ఎకరానికి దిగుబడి 10టన్నుల చొప్పున పొందవచ్చునన్నారు. రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి భూ ఆధార్ రైతు రిజిస్ట్రర్ నమోదు చేయించుకోవాలని సూచించారు. హెచ్ ఓ కవిత ఆయిల్ ఫామ్ సబ్సిడీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారి పల్లె వెంకటేశం, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయానికి దూరమవుతున్న మైనారిటీలు

* సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి



ప్రజాస్ఫూర్తి, కాప్రా: మైనారిటీలు' సామాజిక న్యాయానికి దూరమవు తున్నారని సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి, రాష్ట్ర సెక్రెటరీ మహమ్మద్ ముజాహిద్ అన్నారు. మంగళవారం సమాజ్వాది పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కేంద్రంగా తెలంగాణ రాష్ట్ర పాలన జరుగుతుందని ముఖ్యమంత్రి ప్రకటించారు కానీ సామాజిక న్యాయ సాధనకు అవసరమైన కులగణన లెక్కలు ఇంత వరకు బయటికి ప్రకటించ లేదన్నారు. పది శాతం బీసీ ముస్లింలతో కలుపుకొని వెనుకబడిన తరగతుల వారు 56% జనాభా ఉన్నదని ప్రభుత్వం ప్రకటించిందని, మొత్తం ముస్లిం జనాభా పదమూడు శాతానికి పైగా ఉన్నట్లు తెలుస్తుందన్నారు. ముస్లింల తో పాటు మిగిలిన మైనారిటీ లు కలుపుకొని దాదాపు 15% గా ఉన్న మైనారిటీలకు ప్రభుత్వ బడ్జెట్ లో ఎలాంటి మేలు జరగలేదని విమర్శించారు. మైనారిటీలు అత్యధిక దీనస్థితిలో ఉన్నారని, ఈ సంవత్సరం బడ్జెట్లో దాదాపు 3600 కోట్లు ప్రకటించినా పెద్దగా ఉపయోగకరంగా లేదన్నారు. వీరి నుండి ఎంటర్ ప్రేనూర్స్ కాలేక పోతున్నారని, ప్రభుత్వ సబ్సిడీల లేమితో వీరిలో నిరుద్యోగం, పేదరికం కొనసాగుతుందన్నారు. చివరకు కుట్టుమిషన్లు కూడా ప్రభుత్వం అరకొరగానే పంచిందని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థ తోడ్పాటు తోనే మైనారిటీల అభివృద్ధి, సమానత్వం సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవగాహనతో కూడిన బడ్జెట్ ను సబ్ ప్లాన్ రూపంలో అందించాలని డిమాండ్ చేసారు. పంచాయతీరాజ్ ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్లు పెంచుతూ కేంద్ర ప్రభుత్వానికి పంపిన చట్టాన్ని అమలు చేసిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలని వారు సూచించారు

## ప్రజల రక్షణ సంక్షేమమే మొదటి ప్రాధాన్యతగా పనిచేస్తున్నాం

* బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రజల రక్షణ సంక్షేమమే మొదటి ప్రాధాన్యతగా పనిచేస్తున్నామని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ వెంకన్న హిల్స్ 2 కాలనీలో నూతనంగా నిర్మించిన కల్వర్టును బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలలో అకాల వర్షాలతో ముంపుకు గురవడాన్ని తగ్గిస్తూ సురక్షితమైన ప్రయాణం కోసం కాలువలలో రిటర్నింగ్ వాల్ నిర్మాణంతోపాటు కలవట్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. రిటర్నింగ్ వాల్, కల్వర్టుల నిర్మాణంతో కుత్బుల్లాపూర్ ను మురుగునీరు రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్దిరాములు, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, ఎల్లా గౌడ్, కాలే నాగేష్, కాలే గణేష్, విజయ్ హరీష్, నదీమ్ రాయ్, బాల మల్లేష్, కుంట వేణు, ఆటో బలరాం, నారాయణ, డీజే రమేష్, సీనియర్ సిటిజన్స్ ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, కోశాధికారి మురళీ గౌడ్, ఉపాధ్యక్షులు నరహరి, లక్ష్మణా చారి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బిక్షపతి, వెంకన్న హిల్స్ 2 కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జయం చారి, ఉపాధ్యక్షులు ఏ.ఎల్. నాయుడు, ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్, కోశాధికారి రాజేందర్, సభ్యులు శ్రీనివాస్, పిచ్చయ్య, సుభాష్, శ్రీనివాస్ రెడ్డి, మేఘన , ఫణి, వెంకటేశ్వర్లు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సంస్థాగత పటిష్టత కోసం రాజాపేటలో ప్రత్యేక సమావేశం



రాజపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల కేంద్రంలో అతిథి గృహంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పటిష్టత కొరకు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్లు, డిసిసి అధ్యక్షుడు అందెం సంజీవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ మరింత బలోపేత దిశగా వెళ్లాల్సిందని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నెమలి మహేందర్ గౌడ్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఇంజ నరేష్, రెడ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, రాజపేట పట్టణ శాఖ అధ్యక్షులు ఐరెని నవీన్ కుమార్, మండల,గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి స్కూల్ బస్సుకు ఫిట్నెస్ తప్పనిసరి

: వెంకటరమణ జిల్లా రవాణా అధికారి




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మంగళవారం జిల్లా రవాణా కార్యాలయంలో వివిధ స్కూల్ బస్సుల డ్రైవర్లకు బస్సు ఫిట్నెస్, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ వాహనం నడిపే ముందు ఫిట్నెస్ చెక్ చేసిన తర్వాతనే పిల్లలను బస్సులలో ఆహ్వానించాలని, ప్రతి వాహనానికి అటెండెంట్ ఉండాలని, ప్రతి నెల డ్రైవరు తమ ఆరోగ్యం చెక్ అప్ చేసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని,చట్ట ప్రకారం నడుచుకోవాలని, స్కూల్ యాజమాన్యాలు, డ్రైవర్లు బాధ్యతగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా స్కూల్ బస్సు పాటించవలసిన నియమాల గురించి కరపత్రాలు విడుదల చేశారు.

## పాఠశాల అభివృద్ధి కోసం ముందుకు వచ్చిన ఎన్ఆర్ఐ....




యాదగిరిగుట్ట , ప్రజా స్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కీర్తిశేషులు చింతకుంట్ల రవీందర్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు చింతకుంట్ల కీర్తన రెడ్డి (యూఎస్ఏ) ముందుకు వచ్చారు. గ్రామంలోని పాఠశాలలో రంగులు, విద్యార్థులకు దుస్తులు, బూట్లు అందించేందుకు 5 లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గవ్వల రాములు మాట్లాడుతూ గ్రామంలో గల పాఠశాలలో విద్యను అభ్యసించి వివిధ స్థాయిలలో, వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వారందరూ పాఠశాల అభివృద్ధి కోసం ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి చైర్మన్ కర్రె సత్తయ్య, మాజీ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు కర్రే చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు....

# ఉచిత విద్యకు అయ్యే ఖర్చు నేరుగా
# విద్యార్థుల ఖాతాల్లోనే వేయాలి



*** మాజీ మంత్రి,ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కి ట్రస్మా రాష్ట్ర ప్రతినిధుల బృందం వినతి.**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతీ పాఠశాలలో 25% బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉచిత విద్యకు అయ్యే ఖర్చు నేరుగా విద్యార్థుల ఖాతాల్లోనే వేయాలని కోరుతూ ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి తో పాటు ప్రతినిధుల బృందం మంగళవారం మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్మ రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నదని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మీడియాలో చెప్పడం, గత మూడు సంవత్సరాల నుండి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ పాఠశాలలకు రావాల్సిన నిధులు విడుదల చేయకపోవడం వలన పాఠశాలల యాజమాన్యాలు, ఇటు స్కాలర్ షిప్ నిధులు విడుదల కాకపోవడంతో జూనియర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, అటు గురుకుల అద్దె భవనాల రెంట్లు(అద్దె) చెల్లించక గురుకుల భవనాల యాజమాన్యాలు ఆందోళనలకు గురవుతున్నారన్నారు. మా ప్రైవేట్ పాఠశాలలు విద్య హక్కు చట్టానికి వ్యతిరేకం కాదన్నారు. ప్రతి బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలకు వెబ్‌సైట్ నిర్వహణ తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన చిన్న పాఠశాలల విషయంలో సాధ్యపడదు. అందువల్ల, దీనిని ఐచ్ఛిక నిబంధనగా మార్చాలని కోరారు. భవన అద్దె ఖర్చులు మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి, ప్రభుత్వం విధించే ప్రమాణాలకు కాదు. అందువల్ల, ఈ ఉప నిబంధనను తొలగించాలన్నారు. గుర్తింపు పొందిన పాఠశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ సంఘం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న తాము ప్రైవేట్ బడ్జెట్ పాఠశాలల నిర్వహకులమని దాదాపు పదివేలకు పైగా స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రైవేట్ పాఠశాలల,బడ్జెట్ పాఠశాలల తరపున రాష్ట్రంలోని 33 జిల్లాల ఎమ్మెల్యేలకు తమ ట్రస్మా ప్రతినిధుల బృందం వినతిపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అజర్,బాలనగర్ మండల అధ్యక్షులు సుశీల్,కార్యనిర్వాహక కార్యదర్శి అబ్దుల్ వాహీద్,ఉపాధ్యక్షులు అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

## తిరంగా యాత్రలో పాల్గొన్న రాజాపేట నాయకులు



రాజాపేట, ప్రజాస్ఫూర్తి : దేశ భద్రత కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ' ఆపరేషన్ సిందూర్ ' తో శత్రువుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఘన వీర భారత జవాన్ల విజయానికి సంఘీభావంగా, వారి త్యాగాలకు గౌరవం తెలియజేయడానికి మంగళవారం భువనగిరిలో జరిగిన తిరంగా యాత్ర కార్యక్రమానికి రాజపేట మండల బిజెపి నాయకులు, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ తో కలిసి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలు చేత పట్టుకొని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ యాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఆర్ టి ఐ కమిషనర్ కు జర్నలిస్టుల అభినందనలు

*** సత్కరించిన టి యు డబ్ల్యూ జె మేడ్చల్ జిల్లా ప్రతినిధులు**



ప్రజాస్ఫూర్తి, మేడ్చల్ : రాష్ట్ర సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) కమిషనర్ గా నియమితులైన సీనియర్ జర్నలిస్టు బోరెడ్డి అయోధ్య రెడ్డిని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) మేడ్చల్ జిల్లా శాఖ జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం కాప్రా లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. అయోధ్యరెడ్డిని కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు గడ్డమీది బాలరాజు గౌడ్, దొంతుల వెంకట్రామిరెడ్డి మరియు సీనియర్ జర్నలిస్టులు భాస్కర్ రెడ్డి, బి. విజయ్ కుమార్, వేముల తిరుపతి రెడ్డి, వేముల శంకర్, కే నరోత్తంరెడ్డి, ఎం, సురేష్, అదిమూలం శ్రీనివాస్, రుద్రగోని నరసింహ గౌడ్, ఏవి శ్రీధర్ రావు, శేషారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకులు మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన అయోధ్య రెడ్డి జర్నలిస్టుగా రాణించడమే కాకుండా రాష్ట్ర సమాచార చట్టం కమిషనర్ గా నియమితులు కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

## హెచ్ బీ కాలనీ డివిజన్ లో సమస్యలను పరిష్కరించాలని జోనల్ కమిషనర్ కు వినతి



ప్రజాస్ఫూర్తి, కాప్రా: మీర్ పేట హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని హెచ్ బీ కాలనీ ఫేజ్ 1 ప్లే గ్రౌండ్ మరియు చైతన్యనగర్ డబుల్ బెడ్ రూం కాలనీలకు ఓపెన్ జిమ్ మంజూరు చేయాలని అలాగే లక్ష్మీనగర్ స్మశానవాటిక ప్రహరీ చుట్టూ ఫెన్సింగ్ మరియు స్మశాన వాటికలో మౌలిక వసతుల ఏర్పాటు చేయాలని ఎల్ బి నగర్ జోనల్ కమీషనర్ హేమంత కేశవ్ పాటిల్ ని కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ స్మశానవాటిక ప్రహరి గోడ ఎత్తు తక్కువగా ఉండడం వలన స్థానికులు చెత్త వేయడం వలన అపరిశుభ్ర వాతావరణము ఏర్పడుతుందని, ఈ స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడకు ఐరన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మరియు స్మశాన వాటికలో మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. హెచ్ బీ కాలనీ ఫేజ్ 1 ప్లే గ్రౌండ్ మరియు చైతన్యనగర్ డబుల్ బెడ్ రూం కాలనీలకు ఓపెన్ జిమ్ లు ఏర్పాటు చేయవలసిందిగా జోనల్ కమిషనర్ ని కోరడం జరిగిందని తెలిపారు.



## నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలి

*** తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి**

ప్రజాస్ఫూర్తి, కాప్రా : కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ అమలవుతే కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు కోల్పోయి, బిక్షాటనకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి అన్నారు. మంగళవారం కుషాయిగూడ మార్కెట్ ఆవరణంలో దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు కనీస స్థిర వేతనం ఇరవై ఆరువేలు ఇవ్వాలని, వారిని మూడవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ వంటి హక్కులను కల్పించాలని కోరారు. లేబర్ కోడ్స్ అమలు అవుతే రోజుకు పన్నెండు గంటల పనివేళలు విధించే ప్రమాదం ఉందని, కార్మిక హక్కులు హరించుకుపోతాయని ఆమె హెచ్చరించారు. అలాగే, ఎన్ఆర్‌హెచ్ఎం స్కీమ్‌కు కేటాయించే బడ్జెట్ పెంచాలని కోరుతూ, డిమాండ్లు నెరవేరకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్వేతా, అన్నపూర్ణ, స్వర్ణ, అనురాధ, భవాని తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి

*** వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి కి కార్పొరేటర్ వినతి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : డివిజన్ లోని వివిధ కాలనీలలో చేపట్టాల్సిన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సమస్య చాలా తీవ్రంగా ఉందని వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి ని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బొంతు శ్రీదేవి యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సాంక్షన్ అయిన పనులని ఇంకా కాలనీలలో చేపట్టడం లేదని అతి త్వరలోనే సాంక్షన్ అయిన పనులను క్రమంగా నిర్వహించాలని వారిని కోరారు. ప్రధానంగా హనుమాన్ నగర్, శ్రీకృష్ణ రెడ్డి నగర్, లక్ష్మీ నగర్, నేతాజీ నగర్, నాగార్జున నగర్, చక్రిపురం, బి.యన్.రెడ్డి, చిన్న చర్లపల్లి, సోనియా గాంధీ నగర్ కాలనీ, వెంకట్ రెడ్డి నగర్, విరాట్ నగర్,ఇంకా పలు కాననీలలోని సమస్య లు తీవ్రంగా ఉండడం వలన కాలనీలలోని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పెరుగుతున్న కాలనీలు జనాభాకు అనుగుణంగా డ్రైనేజ్ పైపులైన్ వ్యవస్థను మరింత విస్తీర్ణత పెంచే ఏర్పాటు చేయాలని ప్రత్యేకంగా కోరారు. ఎండి అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ సూచించిన కాలనీల అన్నింటికీ త్వరలోనే పనులు శాంక్షన్ చేసి పనులు మొదలు చేయిస్తానని కార్పొరేటర్ కి తెలియజేశారు. వెంటనే కార్పొరేటర్ జలమండలి ఎండి అశోక్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్, ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి,మేడ్చల్ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు స్వర్ణరాజ్ శివమణి, రావుల వెంకటేశ్వర్ రెడ్డి,సుజాత నాయక్, తదితరులు పాల్గొన్నారు..



## భగవద్గీత మానవుని జీవన విధానానికి మార్గదర్శికం

*** బీఆర్ఎస్ పార్టీ విప్ , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్ , (ప్రజాస్ఫూర్తి) : భగవద్గీత అనేది ఒక ఇతిహాసం మాత్రమే కాదని, మానవుని జీవన విధానానికి మార్గదర్శికమని బీఆర్ఎస్ పార్టీ విప్ , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ పైప్ లైన్ రోడ్డు లో శ్రీ కృష్ణ ప్రణామి సేవా సమితీ ఆధ్వర్యంలో డాక్టర్ సదానంద్ జీ మహారాజ్ పర్యవేక్షణలో నూతనంగా నిర్మించనున్న "శ్రీకృష్ణ భగవాన్ దేవాలయానికి" బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ధర్మాన్ని కాపాడు... అది నిన్ను కాపాడుతుందని ప్రపంచానికి చాటిన దైవం శ్రీకృష్ణుడన్నారు. భగవద్గీత పఠనం ద్వారా మనలోని చెడు ను తొలగించుకొని సన్మార్గం వైపు జీవన విధానం మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్దిరాములు, నరేందర్ రెడ్డి, కాలే నాగేష్, కాలే గణేష్, బాల మల్లేష్, మాధవ రెడ్డి, సుమేర్ సింగ్, దేవాలయ కమిటీ చైర్మన్ నరేష్ మిట్టల్, ఉపాధ్యక్షులు రాంనారాయణ జీ మిట్టల్, ప్రధాన కార్యదర్శి గణేష్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి ప్రదీప్ అగర్వాల్, కోశాధికారి చేతన్ శర్మ, ముఖ్య సలహాదారులు జోగి రామ్ జి అగర్వాల్, రాజీవ్ అగర్వాల్, సవర్మాల్ అగర్వాల్, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు, జీలుగ విత్తనాలు

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చౌటుప్పల్‌లో 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతగా జీలుగ 160బ్యాగులు వచ్చాయని పేర్కొన్నారు. పచ్చి రొట్టె ఎరువులైన జీలుగ విత్తనాలను బుధవారం నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చౌటుప్పల్ లో రైతులకు అందజేయబడునని పేర్కొన్నారు. జీలుగ విత్తనాలు 30కిలోల బ్యాగుకు రూ.4,275ఉంటుందని, సబ్సిడీ రూ.2137.50పోను మిగతా రూ.2137.50లు రైతు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చౌటుప్పల్‌లో ఆధార్ కార్డు, భూమి పాసు పుస్తకాల జీరాక్స్ తీసుకొని పొందవచ్చునని పేర్కొన్నారు.

## తిరంగా యాత్రను జయప్రదం చేయాలి

**- దూడల బిక్షం గౌడ్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఈ నెల 23వ తేదీన సాయంత్రం నిర్వహించ తలపెట్టిన తిరంగా యాత్రను జయప్రదం చేయాలని బిజెపి మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ సింధూర్ విజయం పట్ల త్రివిధ దళాల సేవలకు కృతజ్ఞతగా, మన దేశ ఐక్యతకు చిహ్నంగా, తిరంగా యాత్రను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణ నుంచి వలిగొండ రోడ్డు చౌరస్తా వరకు, తిరిగి బస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ర్యాలీలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటాలని, విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

## చౌటుప్పల్ తహసిల్దార్ గా వీరాబాయి బాధ్యతల స్వీకరణ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండల తహసిల్దార్ గా వీరాబాయి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అంబర్ పేట తహసిల్దార్ గా పనిచేస్తున్న మీరాబాయి బదిలీపై చౌటుప్పల్ కు వచ్చారు. చౌటుప్పల్ తహసిల్దార్ గా పనిచేస్తున్న హరికృష్ణ బదిలీపై గుండాలకు వెళ్లారు. తహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన వీరాబాయికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా రాంచందర్ నాయక్ చౌహన్ జన్మదిన వేడుకలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంచందర్ నాయక్ చౌహన్ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి కులదైవం సేవాలాల్ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జన్మదినంలో భాగంగా డాక్టర్ సరోజినీ నాయుడు పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి , ఎం ఎం సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కొలన్ జీవన్ రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, లింగాల గంగాధర్, ఎస్పీ నాయక్, మౌలేశ్వర రావు,ప్రభాకర్ రెడ్డి,అల్లాడి మహేష్, బాలకృష్ణ, లక్ష్మణ్, శ్రీనివాసరాజు (మీసాల రాజు), ప్రశాంత్ రెడ్డి, శివ నాగరాజు యాదవ్, రమ, సరిత రెడ్డి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్నెట్ లో ఓ రేంజిలో ట్రెండింగ్ అవుతున్న 'తెలంగాణ'..

* హైదరాబాద్‌లో 72వ మిస్ వరల్డ్ పోటీల సందడి
* నగరానికి వెల్లువెత్తుతున్న అంతర్జాతీయ గుర్తింపు
* సోషల్ మీడియాలో లక్షల వ్యూస్, హ్యాష్‌ట్యాగ్‌ల హోరు
* తెలంగాణ పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్న సుందరీమణులు
* మునుపెన్నడూ లేని విధంగా పోటీలకు విశేష స్పందన



తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు ఇంటర్నెట్ లో టాప్ లెవల్లో ట్రెండింగ్ అవుతోంది. అందుకు కారణం అందాల పోటీలే. హైదరాబాద్ నగరం ఇప్పుడు అంతర్జాతీయ అందాల పోటీలకు కేంద్ర బిందువుగా మారింది. ప్రతిష్ఠాత్మకమైన 72వ మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇస్తుండటంతో, భాగ్యనగరానికి ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానం లభిస్తోంది. ఈ పోటీల కారణంగా హైదరాబాద్ పేరు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోంది. వివిధ దేశాలకు చెందిన అందాల రాణులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. వారు తమ అనుభవాలను, హైదరాబాద్ నగర సౌందర్యాన్ని, ఇక్కడి విశేషాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. దీంతో వారి పోస్టులకు లక్షలాది వ్యూస్ వస్తుండగా, వేల సంఖ్యలో హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతున్నాయి. ఇప్పటివరకు జరిగిన మిస్ వరల్డ్ పోటీలతో పోలిస్తే, హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ ఎడిషన్‌కు వస్తున్న స్పందన అపూర్వమని, సోషల్ మీడియా పోస్టుల ద్వారా వెల్లడవుతోంది. సాధారణంగా మిస్ వరల్డ్ పోటీలు ఎక్కడ జరిగినా వాటికి ప్రపంచవ్యాప్తంగా మంచి ప్రచారం లభిస్తుంది. అదొక అంతర్జాతీయ వేడుక కాబట్టి స్పందన కూడా అదే స్థాయిలో ఉంటుంది. అయితే, ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో, హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ 72వ ఎడిషన్‌కు గతంలో ఎన్నడూ లేనంతగా ఆన్‌లైన్‌లో స్పందన వస్తుండటం విశేషం. దీనికి తోడు, ఈ అందాల తారలు ప్రతీరోజూ తెలంగాణలోని చారిత్రక, సాంస్కృతిక, పర్యాటక ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలను సందర్శిస్తున్నారు. వారి పర్యటనల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చూడచక్కని ప్రాంతాల గురించి కూడా ప్రపంచానికి తెలుస్తోంది. ఇది హైదరాబాద్ నగరానికే కాకుండా, యావత్ తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది.




## సురేంద్రపురి లో హనుమాన్ జయంతి దివ్యోత్సవము

యాదగిరిగుట్ట, ప్రజా స్పూర్తి :ఈ నెల 22 వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా సురేంద్రపురి లోని కంచికామకోటి పీఠం పంచముఖ హనుమదీశ్వర,వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో హనుమాన్ జయంతి దివ్యోత్సవము,22వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు...22వ తేదీన ఉదయం 6 గంటలకు మూలమూర్తులకు పంచామృత నిజాభిషేకం,అలంకరణ,సహస్రనార్చన,మాలా విరమణ కార్యక్రమం... ఉదయం 9.30 నిమిషాలకు నవగ్రహ హోమము,మూల మంత్ర దేవతాహోమము,శ్రీ మాన్యూసూక్తహోమము,రుద్రహవనము,బలి ప్రధానం,పూర్ణాహుతి,ఉదయం 11 గంటలకు శ్రీ సువర్చలా సహిత పంచముఖ హనుమంతుని కళ్యాణ మహోత్సవం...మధ్యాహ్నం 1 గంటలకు అన్నప్రసాద కార్యక్రమం...సాయంత్రం 6గంటల నుండి కోలాట భజనలు,బాణసంచా వెలుగుల నడుమ స్వాము వారి కళ్యాణం సేవ ఊరేగింపు నిర్వహించనున్నట్టు తెలిపారు...అనేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక,సంప్రదాయం కార్యక్రమలు వైభవంగా నిర్వహించానున్నటు తెలిపారు.

## సాగునీటి కాలువలు, ప్రాజెక్టుల పై నీటిపారుదల శాఖ మంత్రి తో సమీక్ష సమావేశం



యాదగిరిగుట్ట, ప్రజా స్పూర్తి: సాగునీటి కాలువలపై ,ప్రాజెక్టుల నిర్మాణం పై హైదరాబాద్ లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వవిప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ,భువనగిరి ఎమ్మెల్యే. కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సమేల్ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు. బునాదిగాని కాలువ ,తుర్కపల్లి మండలంలోని గంధ మల్ల ప్రాజెక్టుపై పలు విషయాలు అధికారులతో చర్చించారు. తొందరలోనే గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమానికి సన్నాహకలు జరుగుతున్నాయన్నారు..బునది గాని కాలువ నిర్మాణం పనులు పై చర్చించారు..

## దోస్త్ గడువు రేపే లాస్ట్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ 2025 ఫేజ్ 1 రిజిస్ట్రేషన్ రేపటితో ముగియనుంది. మే 3న ప్రారంభమైన దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ, మే 21న ముగియనుందని ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. తెలంగాణలోని ఆరు విశ్వవిద్యాలయాల్లో(ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మా గాంధీ, సతవాహన) డిగ్రీ కోర్సులైన BA, B.Com, B.Sc, BBA, BCA, BSW, DPharmacy మొదలైన వాటిలో ప్రవేశాల కోసం ఈ ప్రక్రియ నిర్వహించబడుతుంది. దీని ద్వారా సుమారు 4 లక్షల సీట్లు భర్తీ చేయబడనుండగా.. ఇప్పటి వరకు 64 వేల మంది రిజిష్ట్రేషన్ చేసుకున్నారు. రిజిష్ట్రేషన్ చేసుకున్న వారికి ఈనెల 10న ప్రారంభం అయిన వెబ్ ఆప్షన్స్ ప్రక్రియ కూడా మే 22న ముగియనుంది. అయితే రిజిష్ట్రేషన్ చేసుకున్న వారిలో సగం మంది మాత్రమే వెబ్ ఆప్షన్స్ ఎంచుకున్నట్టు సమాచారం. మే 29న సీట్ల కేటాయింపు జరగనుండగా.. రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్స్ గడువు తేదీ పెంచాలని విద్యార్థుల నుంచి భారీగా వినతులు వస్తున్నట్టు సమాచారం.

## హైదరాబాద్‌లో మరో అగ్ని ప్రమాదం.. బోయగూడలో రెండంతస్తుల భవనంలో మంటలు

* రెండో అంతస్తులోని చెప్పల గోదాంలో చెలరేగిన మంటలు
* భయంతో బయటకు పరుగులు తీసిన స్థానికులు
* రెండు ఫైర్ ఇంజన్లతో మంటలార్పిన అగ్నిమాపక సిబ్బంది



హైదరాబాద్ నగరంలో మరో అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడం కలకలం రేపింది. ఛత్రినాక పోలీసు స్టేషన్ పరిధిలోని బోయగూడలో ఉన్న రెండంతస్తుల భవనంలో మంటలు అంటుకోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే, బోయగూడలోని ఒక రెండంతస్తుల భవనం రెండో అంతస్తులో మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు వేగంగా వ్యాపించడంతో భవనంలో ఉన్నవారు, చుట్టుపక్కల వారు భయంతో వెంటనే బయటకు పరుగులు తీశారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఛత్రినాక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రెండు ఫైర్ ఇంజన్ల సహాయంతో అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగిన భవనంలో చెప్పుల గోదాము నడుపుతున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. రెండు రోజుల క్రితం గుల్జార్ హౌస్ సమీపంలోని ఓ భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

## కేసీఆర్, హరీశ్ రావు, ఈటల రాజేందర్‌కు నోటీసులు!

* కాళేశ్వరం విచారణ కమిషన్ నుంచి నోటీసులు
* నోటీసులు జారీ చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
* వివరణ ఇచ్చేందుకు 15 రోజుల గడువు



కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు విచారణ కమిషన్ నోటీసులు జారీ చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. కేసీఆర్‌తో పాటు, ఆయన ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన హరీశ్ రావు, బీజేపీ ఎంపీగా ఉన్న ఈటల రాజేందర్‌కు కూడా కమిషన్ నోటీసులు పంపింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలపై వివరణ ఇచ్చేందుకు ఈ నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న 15 రోజుల్లోగా కమిషన్ ఎదుట హాజరై తమ వాదనలు వినిపించాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఆదేశించింది. ఇందుకోసం నిర్దిష్ట తేదీలను కూడా కమిషన్ ఖరారు చేసింది. కేసీఆర్ జూన్ 5వ తేదీన విచారణకు హాజరు కావాలని కమిషన్ తన నోటీసులో స్పష్టం చేసింది. అలాగే, కేసీఆర్ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన హరీశ్ రావు జూన్ 6వ తేదీన, ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ జూన్ 9వ తేదీన విచారణకు హాజరు కావాలని కమిషన్ పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై కూడా విచారణ జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం న్యాయ విచారణ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్ నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, పే అండ్ ఎకౌంట్స్, నీటి పారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు అవసరానికి తగిన విధంగా కమిషన్ గడువును ఏడుమార్లు పొడిగించింది.

## పెంచిన జీతాలు తగ్గించే సంప్రదాయానికి కాంగ్రెస్ తెరలేపింది




మినీ అంగన్వాడీ కార్యకర్తలను పూర్తిస్థాయి అంగన్వాడీలుగా గుర్తించి, వారికి పెంచిన వేతనాలను తక్షణం చెల్లించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని, బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన జీవోను కాపీ కొట్టి ప్రచారం చేసుకోవడం మినహా వారికి చేసిందేమీ లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 3,989 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తల సేవలను గుర్తించి, వారిని అంగన్వాడీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ 2023 సెప్టెంబర్‌లో జీవో ఇచ్చిందని, అయితే ఎన్నికల కోడ్ కారణంగా అది అమలు కాలేదని హరీశ్ రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, మంత్రి సీతక్క ఇదే అంశంపై తొలి సంతకం చేశారని, డిసెంబర్ 15న జీవో కూడా ఇచ్చారని, కానీ అది పాత జీవోకు నకలేనని ఆరోపించారు. ప్రభుత్వం జనవరి 2024 నుంచి మూడు నెలల పాటు రూ. 13,650 చొప్పున పెరిగిన వేతనం అందించి, ఆ తర్వాత మళ్లీ వారి జీతాన్ని రూ. 7,800కు తగ్గించి పాత పద్ధతిలోనే చెల్లిస్తున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అత్యంత దారుణమని, పెంచిన జీతాలు తగ్గించే సంప్రదాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని ఎద్దేవా చేశారు. మే నెలకు సంబంధించి కేవలం 8 జిల్లాల్లోనే పెరిగిన జీతాలు చెల్లించి, మిగతా జిల్లాల వారిని విస్మరించడం అన్యాయమన్నారు. జనవరి 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న పూర్తి జీతాలను మినీ అంగన్వాడీలందరికీ వెంటనే చెల్లించాలని, అంగన్వాడీ కేంద్రాలుగా మారిన చోట హెల్పర్లను నియమించాలని, మే నెల జీతాలు అందని జిల్లాల్లో కూడా తక్షణమే పంపిణీ చేయాలని హరీశ్ రావు తన లేఖలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న మహిళల కడుపు కొట్టడం సరికాదని హితవు పలికారు.

# ప్రతీకార దాడుల వేళ.. గోల్డెన్ టెంపుల్‌లో 'ఆయుధాలకు' అనుమతి



అమృత్‌సర్ స్వర్ణ దేవాలయాన్ని పాకిస్థాన్ లక్ష్యంగా చేసుకుందని అయితే, భారత్ సైన్యం దానిని సమర్థంగా తిప్పికొట్టిందని ఆర్మీ ఉన్నతాధికారులు ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై వైమానిక దళ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సుమర్ ఇవాన్ మాట్లాడుతూ.. దేశంలో అంతర్గత కలహాలు సృష్టించడానికి పాక్ ఇక్కడి ఆలయాలపై దాడులు చేస్తుందని తాము ఊహించామని అన్నారు. అనుకున్నట్లుగానే పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయంపై దాడులకు కుట్ర పన్నుతున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయని అన్నారు. అమృత్‌సర్‌లోని పవిత్ర స్వర్ణ దేవాలయానికి ముప్పు పొంచి ఉందని తాము సమాచారం ఇవ్వగానే అక్కడి పెద్దలు తమకు పూర్తిగా సహకారం అందించారని పేర్కొన్నారు. ఆయుధాలు తీసుకెళ్లడానికి ఆ ఆలయ ప్రధాన గ్రంథి (గురుద్వార్ పర్యవేక్షకుడు) సైనికులకు ప్రత్యేక అనుమతిని ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. ''దేవాలయంలోని ప్రధాన ప్రదేశాల్లో సైనికులు తుపాకులతో మోహరించడానికి మాకు అనుమతి ఇచ్చారు. అంతే కాకుండా ప్రయోగిస్తున్న క్షిపణులను గుర్తించడానికి వీలుగా స్వర్ణ దేవాలయంలోని లైట్లను ఆపివేయించారు. బహుశా ఎన్నో ఏళ్లుగా వెలుగుతున్న ఆ లైట్లు ఆపివేయడం ఇదే మొదటిసారి కావచ్చు. అందుకు వారికి కృతజ్ఞతలు'' అని లెఫ్టినెంట్ జనరల్ పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పాకిస్థాన్ అక్కసుతో స్వర్ణ దేవాలయాన్ని లక్ష్యంగా చేసుకుందని మేజర్ జనరల్ కార్తిక్ సి శేషాద్రి వెల్లడించారు. మన ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ గన్నర్స్.. పాకిస్థాన్ సైన్యం ప్రణాళికలను తిప్పికొట్టారని తెలిపారు. మన స్వర్ణ దేవాలయంపై ఒక్క గీత కూడా పడకుండా అన్ని డ్రోన్లు, క్షిపణులను కూల్చివేశారని మేజర్ జనరల్ వెల్లడించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వందలాది పాక్ డ్రోన్స్, మిసైల్స్‌ను పాక్ ప్రయోగించిందని.. మన ఎస్ 400, ఆకాశ్ తదితర గగనతల రక్షణవ్యవస్థలు అద్భుతరీతిలో వాటిని నేలమట్టం చేశాయని తెలిపారు.



## ఉత్తరాఖండ్‌లో విరిగిపడిన కొండ చరియలు.. చిక్కుకుపోయిన వందలాది యాత్రికులు

ఉత్తరాఖండ్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. పితోరాగఢ్ జిల్లా సమీపంలో కైలాస్ మానస సరోవర్ యాత్ర మార్గంలో అవి విరిగిపడటంతో వందలాది యాత్రికులు చిక్కుకుపోయారు. వారితో పాటు స్థానికులు కూడా ఉన్నారు. ఆ మార్గాన్ని అందుబాటులోకి తెచ్చే విధంగా స్థానిక యంత్రాంగం సహాయకచర్యలు ప్రారంభించింది. శిథిలాలను తొలగించేందుకు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ బృందం అక్కడకు చేరుకుంది. తాజా ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు వెల్లడించారు. పరిస్థితులు మెరుగుపడేవరకు యాత్రికులు అక్కడే ఉండాలని సూచించారు. ఐదేళ్లుగా నిలిచిపోయిన కైలాస్ మానస సరోవర్ యాత్రను ఈ ఏడాది జూన్ నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం గత నెల అధికారికంగా ప్రకటించింది. జూన్ నుంచి ఆగస్టు వరకూ కొనసాగనున్న ఈ యాత్ర ఉత్తరాఖండ్, సిక్కింలలో ప్రారంభం కానుందని విదేశీ వ్యవహారాలశాఖ తెలిపింది. '50' మంది యాత్రికుల చొప్పున 5 బృందాలు ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ నుంచి, 10 బృందాలు సిక్కిం నాథులా పాస్ నుంచి ఈ యాత్రకు తరలి వెళ్తాయి' అని వెల్లడించింది. యాత్ర కోసం దరఖాస్తులను kmy.gov.inలో సమర్పించవచ్చని, కంప్యూటర్ జనరేటెడ్ విధానం ఆధారంగా యాత్రికులను ఎంపిక చేస్తామని పేర్కొంది. కొవిడ్ కారణంగా కైలాస పర్వతం, మానస సరోవర్ సరస్సు యాత్ర 2020లో ఆగిపోయింది. ఆ తర్వాత గల్వాన్ ఘర్షణల కారణంగా భారత్, చైనాల మధ్య సంబంధాలు దెబ్బతినడంతో యాత్ర పునరుద్ధరణ చర్యలు ముందుకు సాగలేదు. గతేడాది రష్యాలో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల భేటీ అనంతరం ఇరు దేశాల సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చే చర్యలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే కైలాస్ మానస సరోవర్ యాత్రను తిరిగి ప్రారంభిస్తున్నారు. సాక్షాత్తూ పరమశివుడు నివాసముంటాడని విశ్వసించే చోటు కైలాస పర్వతం. బ్రహ్మముహూర్తంలో దేవతలు స్నానమాచరించే ప్రాంతంగా విశ్వసించే మానస సరోవరం సరస్సూ అక్కడికి చేరువలోనే ఉంటుంది. టిబెట్‌లోని ఈ రెండు సుమనోహర పుణ్యక్షేత్రాలు హిందువులతో పాటు జైనులు, బౌద్ధులకూ అత్యంత పవిత్రమైనవి. ఏటా ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కైలాసమానస సరోవర యాత్రలో పాల్గొంటారు.

## డార్క్ వెబ్‌లో ఆ విద్యార్థి కార్యకర్తకు అకౌంట్లు.. మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్



భారత ప్రభుత్వం పాక్‌లోని ఉగ్రవాదులపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను, కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ.. సోషల్ మీడియాలో పోస్టులు చేసిన కేరళకు చెందిన విద్యార్థి కార్యకర్త రెజాజ్ ఎం షీబా సిద్ధిఖ్‌ను మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ఇటీవల అదుపులోకి తీసుకుంది. దర్యాప్తులో భాగంగా అతడికి ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని.. నిషిద్ధ డార్క్‌వెబ్ సైట్లలో (Dark web) పలు అకౌంట్లు ఉన్నాయని గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. అతడు డార్క్‌వెబ్‌లో చురుగ్గా ఉన్నాడని.. అందులో దేశవ్యతిరేక పోస్టులను అనుసరిస్తూ.. వాటికి మద్దతు పలుకుతున్నట్లు గుర్తించామని అన్నారు. రెజాజ్‌కు పాకిస్థాన్‌కు చెందిన పలు ఉగ్ర సంస్థలలో సభ్యత్వం కూడా ఉన్నట్లు తెలిపారు. మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి అతడి వద్ద ఉన్న డిజిటల్ పరికరాలను సైబర్ ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో అతడు చేసిన పోస్టులలో నాగ్‌పుర్‌లోని ఒక రైఫిల్ దుకాణాన్ని సందర్శించి.. తుపాకీ పట్టుకొని తీసుకున్న ఫొటోలు ఉండడంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని పేర్కొన్నారు. అతడికి ఇంకా ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయనే విషయాలు తెలుసుకోవడానికి సోషల్ మీడియా అకౌంట్లను తనిఖీ చేస్తున్నామని అన్నారు.

### డార్క్‌వెబ్ అంటే?

డార్క్ వెబ్‌లో కంటెంట్ మొత్తం ఎన్‌క్రిప్ట్ చేస్తారు. దాన్ని వాడాలంటే ప్రత్యేక బ్రౌజర్లు వినియోగించాలి. ద ఆనియన్ రింగ్ (టార్), ఫ్రీ నెట్, ఇన్‌విజిబుల్ ఇంటర్నెట్ ప్రాజెక్ట్(I2P), ద అమీజక్ ఇన్‌కాగ్నిటో లైవ్ సిస్టమ్ (టైల్స్), వోనిక్స్ అందుకు ఉదాహరణలు. డార్క్ వెబ్‌ను తొలినాళ్లలో గోప్యత కోసం రూపొందించినా.. తర్వాత అక్రమార్కులు దాన్ని తమకు అడ్డాగా మలుచుకుంటున్నారు. మారణాయుధాలు, క్రెడిట్ కార్డుల డేటా, మాల్వేర్‌లు ఇలా రకరకాల రహస్య సమాచార విక్రయాలు అందులో జరిగిపోతున్నాయి. తమ సమాచారం ఎవరికీ తెలియకుండా ఉండడానికి అక్రమ వ్యాపారాలు చేసేవారు, ఉగ్రవాదులు దీనిని వినియోగిస్తారు. డార్క్ వెబ్ కార్యకలాపాలు ఎన్‌క్రిప్షన్‌తో ఉండడం వల్ల వాటిని తెలుసుకోవడం చాలా వరకూ కష్టం.

## 'బలోచిస్థాన్'పై సీఎం హిమంత బిశ్వశర్మ కీలక వ్యాఖ్యలు..



గువాహటి: పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్స్ స్థితిగతులపై అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. కల్లోలిత బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో అపారమైన ఖనిజ సంపద ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఆ ప్రాంతం అభివృద్ధి చెందలేదన్నారు. ఈ క్రమంలోనే బలోచిస్థాన్ ప్రావిన్స్ దశాబ్దాలుగా ఆర్థిక, రాజకీయ దోపిడీకి గురవుతోందని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు హిమంత తన 'ఎక్స్' ఖాతాలో ట్వీట్ చేశారు. ''బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో భారీగా ఖనిజ సంపద ఉన్నప్పటికీ నిర్లక్ష్యానికి గురవుతోంది. దశాబ్దాల తరబడి ఆ ప్రాంతంలో ఆర్థిక, రాజకీయ దోపిడీ ఎక్కువైంది. పాకిస్థాన్‌లోని మొత్తం ఖనిజ సంపదలో 80 శాతానికిపైగా బలోచిస్థాన్‌లోనే ఉండగా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అక్కడ భారీగా రాగి బంగారు నిక్షేపాలు కూడా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉపయోగించని సుమారు 5.9 బిలియన్ టన్నుల ఖనిజం, 41.5 మిలియన్ ఔన్సుల బంగారం, 35 మిలియన్ టన్నుల రాగి కూడా ఉంది'' అని హిమంత తెలిపారు. ఇదిలా ఉంటే.. బలోచిస్థాన్‌లో సుయ్ గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్లు 1952లో కనుగొనగా.. 2020 నాటికి పాకిస్థాన్‌కు సుమారుగా 56శాతం సహజ వాయువును అందిస్తోందని హిమంత బిశ్వశర్మ చెప్పుకొచ్చారు. బలోచిస్థాన్‌లోని గ్వదర్ ఓడరేవు 770 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని కలిగి ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలో స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్, ప్రాథమిక మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవన్నారు. ప్రభుత్వ రంగ ఉపాధిలో బలోచిస్థాన్ ప్రావిన్స్ వాటా కూడా తక్కువగా ఉందని పేర్కొన్నారు. ప్రజలు సమృద్ధిగా వనరులు ఉన్న ప్రాంతంలో నివసిస్తున్నప్పటికీ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని వివరించారు. బలోచిస్థాన్‌లో వనరుల కొరత లేదు కానీ.. పాలకుల నిర్లక్ష్యం, రాజకీయ దోపిడీ అధికంగా ఉందని హిమంత ఆరోపించారు. కాగా.. పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ పాక్ ప్రభుత్వ తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు.

## ఉగ్రవాదుల 'యూనిఫామ్' కుట్రలు.. భద్రతా దళాలకు కొత్త సవాల్



పహల్గాం ఉగ్రదాడితో వణికిపోయిన జమ్మూకశ్మీర్ ప్రజలను ఇప్పుడు మరో సమస్య వెంటాడుతోంది. ఉగ్రవాదులు సైనిక దుస్తులు ధరించి సంచరిస్తుండటంతో స్థానికులు గందరగోళానికి గురవుతున్నారు. భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య తేడాను గుర్తించలేక అయోమయపడుతున్నారు. అటు భద్రతా సిబ్బందికి కూడా ముప్పును పసిగట్టడంలో ఇబ్బంది ఎదురవుతోంది. పహల్గాం దాడి నాటి నుంచి ఈ తరహా ఘటనలు పెరగడం ఆందోళనకరంగా మారింది. ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఆ రోజు కాల్పులు జరిపిన దుండగులు సైనిక దుస్తుల్లో వచ్చారని, వారు ఉగ్రవాదులని తెలుసుకోలేకపోయామని నాడు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. దీంతో ఆ దిశగా భద్రతా బలగాలు దర్యాప్తు చేపట్టాయి. అయితే, ఆ తర్వాత కూడా ఉగ్రవాదులు అదే పంథా కొనసాగిస్తున్నట్లు భద్రతా సిబ్బంది గుర్తించారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో ఉగ్రవాదులు సైనిక యూనిఫామ్‌లో కన్పించినట్లు సమాచారం. పహల్గాం ఘటనకు పాల్పడిన ఉగ్రవాదుల కోసం భద్రతా సిబ్బంది జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా ముమ్మర గాలింపు చేపట్టారు. ఈక్రమంలోనే కొద్ది రోజుల క్రితం పుల్వామాలోని త్రాల్‌లో కార్డెన్ సెర్చ్ చేస్తుండగా.. ఉగ్రవాదులు, భద్రతా సిబ్బంది మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఇందులో జైషేమహ్మద్ ఉగ్ర ముఠాకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు ఆసిఫ్ అహ్మద్ షేక్, అమీర్ నజీర్ వనీ, యావర్ అహ్మద్ భట్‌ను బలగాలు మట్టుబెట్టాయి.

## ఆపరేషన్ సిందూర్‌పై అఖిలపక్షం.. యూసఫ్ ఔట్.. అభిషేక్ బెనర్జీ ఇన్!



ఉగ్రవాదంతో అంటకాగుతూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు ఉద్దేశించిన ఏడు బృందాలు విదేశాలకు వెళ్తున్న సంగతి తెలిసిందే. అందులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి బహంపుర్‌కు ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న యూసఫ్ పఠాన్‌ను కేంద్రం ఎంపిక చేయడాన్ని ఆ పార్టీ తప్పుబట్టడంతో ఆయన ఈ బృందం నుంచి తప్పుకొన్నారు. ఈ నేపథ్యంలో యూసఫ్ స్థానంలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీని ఆ పార్టీ ఎంపిక చేసింది. దీనిపై టీఎంసీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పోరాటంలో తమ పార్టీ తరఫున అభిషేక్‌ను ఎంపిక చేయడం గర్వంగా భావిస్తున్నట్లు పేర్కొంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా బెంగాల్ దృఢ వైఖరిని ఆయన ప్రతిబింబించడమే కాకుండా.. ప్రపంచ దేశాల్లో భారత ప్రజల సమష్టి స్వరాన్ని వినిపిస్తారని తెలిపింది. ప్రతినిధి బృందంలో యూసఫ్ పేరును చేర్చడంపై అభిషేక్ బెనర్జీ సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, దేశాన్ని రక్షించడం వంటి జాతీయ భద్రత విషయాలపై తమ పార్టీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తుందని.. కానీ, తమను సంప్రదించకుండా పఠాన్‌ను దౌత్యబృందంలో చేర్చడం సమంజసం కాదని పేర్కొన్నారు.



# షాండ్లియర్ కాదు లైటే

**ఇల్లంతా లైట్లను ఏర్పాటు చేసుకోవడం, ఆడంబరం కోసం ముందు గదిలో షాండ్లియర్‌ను వేలాడదీయడం ఎవరైనా చేసేదే. ఇవి కాకుండా లైట్లతోనే ఇంటికి ఇంకాస్త ట్రెండీలుక్‌ను తేవాలనుకుంటే ఈసారి 'ఎల్ఈడీ సీలింగ్ లైట్ల'ను ఎంచుకుని చూడండి. రంగురంగుల పూలూ, లతలూ మేళవించిన డిజైన్లతో ఆకట్టుకునే ఈ లైట్లను ఇంటి పైకప్పుకు అమర్చుకుంటే అందానికి అందమూ, ఆడంబరానికి ఆడంబరమూ!**









# విటమిన్ 'డి' కచ్చితంగా కావాలండీ!



**రెండేళ్ల పాప తరచూ జబ్బు పడుతోంది... ఇరవై ఏళ్ల అబ్బాయికి ఉన్నట్టుండి జుట్టు ఊడిపోవడం మొదలైంది... అరగంట పనిచేసినా అలసటతో కూర్చుండిపోతుందో మహిళ... మందులు వేసుకున్నా అరవై ఏళ్ల పెద్దాయనకు బీపీ కంట్రోల్ కావట్లేదు... ఈ అనారోగ్యాలన్నింటికీ కారణం ఏంటని పరీక్షలు చేస్తే బయటపడిందేంటో తెలుసా? ప్రధానంగా 'విటమిన్ డి' లోపంతోనే ఆ సమస్యలన్నీ వచ్చాయని! వీళ్లకే కాదు, ఇలా మనదేశంలో 70 నుంచి 90 శాతం జనానికి ఈ సూర్యకాంతి విటమిన్ తగ్గిపోయి, ఆరోగ్యం పాడవుతోందట. మరి అలాంటప్పుడు ఈ 'డి విటమిన్' ఏంటో, దాని కథాకమామీషేంటో కచ్చితంగా తెలుసుకోవాల్సిందే కదా!**



'వెన్ ది సన్ షైన్స్, సో డజ్ యువర్ హెల్త్'... సూర్యరశ్మి వల్ల ఆరోగ్యం మెరుగవుతుందన్న ఈ మాట అక్షరాలా నిజమని చెబుతారు 'డి విటమిన్' గురించి తెలిసినవాళ్లు ఎవరైనా. ఎందుకంటే మన ఆరోగ్యానికి అవసరమైన డి విటమిన్ అందేది సూర్యకిరణాల నుంచే మరి! ఎండ ద్వారా మన శరీరంలో ఉత్పత్తి అయ్యే ఈ విటమిన్ శరీర జీవక్రియలకు అవసరమైన పోషకాల్లో ప్రత్యేకమైనదయినా... చాలావరకూ దీన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆ ఫలితమే వయసుతో సంబంధం లేకుండా పిల్లల నుంచి పెద్దల వరకూ దాపురిస్తున్న సవాలక్ష అనారోగ్యాలు. అసలు మన శరీరానికి డి విటమిన్ ఎంత అవసరం... దీని వల్ల లాభాలేంటీ... ఇది లేకపోతే జరిగే నష్టాలేంటీ... ఎలా ఇది శరీరానికి అందుతుంది... ఏ ఆహారం తినాలి... ఇలా సన్‌షైన్ విటమిన్‌కి సంబంధించిన పూర్తి విశేషాలే ఇవన్నీ!



## ఏంటీ 'డి' విటమిన్?

శరీరానికి అన్నిరకాల పోషకాలూ అందితేనే కదా ఆరోగ్యం. అందులో విటమిన్లూ, ప్రొటీన్లూ, మాంసకృత్తుల్లాంటి వెన్నీ ఉంటాయి. వాటిల్లో డి విటమిన్ పాత్ర అన్నింటికన్నా ముఖ్యమైంది. చర్మంపైన సూర్యరశ్మి పడటం వల్ల తయారయ్యే విటమిన్ డి... కాలేయానికీ, ఆ తర్వాత మూత్రపిండాలకీ వెళ్లి చురుకైన హార్మోన్‌గా మారుతుంది. ఇది ఎముకల ఆరోగ్యానికీ, వ్యాధినిరోధక శక్తి పెరగడానికీ ఎంతో అవసరం. ఇంకా కండరాలూ, మెదడు కణాల పనితీరూ దీనిపైనే ఆధారపడి ఉంటుంది. బీపీ నియంత్రణలో ఉపయోగపడుతూనే, ఇన్సులిన్ ఉత్పత్తి సరిగా జరిగేలా చూస్తుంది ఇది. గుండె ఆరోగ్యానికీ దోహదపడుతుంది. మూడ్ స్వింగ్స్, ఆందోళన లాంటి మానసిక సమస్యల్ని తగ్గించడానికి కూడా డి విటమిన్ కావాల్సిందే. కొన్నిరకాల క్యాన్సర్లనూ ఇది దరిచేరనివ్వదు. అంతేనా... ఆహారపదార్థాల నుంచి కాల్షియం, ఫాస్ఫరస్‌లను శరీరం గ్రహించడానికీ ఇదే కారణం. ఇలా ఎన్నో రకాలుగా సాయపడుతున్న డి విటమిన్ లేకపోతే జరిగే నష్టం అంతా ఇంతా కాదు! అలసట, నొప్పులు మొదలు గుండె జబ్బుల వరకూ డి విటమిన్ లోపం రకరకాల అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది. మనదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగానూ కొన్ని కోట్ల మంది దీని లోపం వల్లే ఎన్నో రోగాల బారిన పడుతున్నారంటే అతిశయోక్తి కాదు. పుట్టబోయే బిడ్డ దగ్గర్నుంచీ పండు వృద్ధుల వరకూ అందరికీ అత్యవసరమైందీ విటమిన్. గర్భంతో ఉన్న తల్లికి విటమిన్ డి లోపం ఉంటే, పుట్టే పిల్లలకూ ఆ లోపం ఉండే అవకాశం ఉంది. చిన్నారుల ఎముకలూ, కండరాలూ బలహీన పడి, దాని ప్రభావం జీవిత కాలం ఉంటుందట. పెద్దవాళ్లలో పేగు, జీర్ణ సంబంధిత వ్యాధులు వస్తాయి. ఎముకలు పెళుసు బారుతాయి. హార్మోన్ల అసమతుల్యత, డిప్రెషన్, మతిమరపు వ్యాధులు, బరువు పెరగడం... ఇలా ఒకటా రెండా, నెమ్మదిగా ఆరోగ్యం మొత్తం అతలాకుతలం అవుతుంది.




## మరి ఏం చేయాలి...

డి విటమిన్‌కు ప్రధానమైన సోర్స్ కచ్చితంగా సూర్యుడే! సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాలు చర్మంలోని కొలెస్ట్రాల్‌తో కలిస్తే డి విటమిన్ తయారవుతుంది. 'మరి మన దగ్గర ఎండ ఎక్కువగానే ఉంటుందీ, పైగా రోజూ ఏదో ఒక పని మీద బయట తిరుగుతూనే ఉంటాం కదా, అయినా ఈ విటమిన్ లోపం ఎందుకు వస్తోందీ' అంటారేమో... ఎందుకంటే ఎండ నేరుగా మనల్ని తాకకపోవడం వల్లే వస్తుంది సమస్యంతా. ఆరుబయట గడిపేలా ఇదివరకటి పరిస్థితులు లేవు. ముఖ్యంగా పట్టణాల్లో జీవనశైలి పూర్తిగా మారిపోయింది. అందుకు తగ్గట్టు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చాలు, శరీరానికి తగినంత డి విటమిన్ అందుతుంది. పొద్దున పూట తొమ్మిది గంటల్లోపు వచ్చే ఎండ నుంచే డి విటమిన్ అందుతుందని అనుకుంటాం కానీ నిజానికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య ఇది మనకు పుష్కలంగా లభిస్తుంది. ఈ సమయంలో 15 నుంచి 30 నిమిషాల వరకూ ఎండ మన శరీరానికి తగిలితే సరిపోతుంది.

ఒంటిని పూర్తిగా కప్పే దుస్తులు వేసుకుంటే, మన చర్మానికి సూర్యరశ్మి అస్సలు తగలదు. సన్‌స్క్రీన్ లోషన్ రాసుకున్నా విటమిన్ డి అంతగా తయారవ్వదు. కాబట్టి, ఎండ కోసం బయటకు వెళ్లినప్పుడు ఆ విషయాల్ని దృష్టిలో పెట్టుకోవాలి. బస్సులూ, కార్లలో వెళుతున్నప్పుడూ, ఇంట్లో కిటికీల నుంచి అద్దాల మీదుగా సూర్యరశ్మి ఒంటి మీద పడటం పెద్దగా ఉపయోగపడదన్న సంగతీ గుర్తుంచుకోవాలి. హానికర యూవీ కిరణాలను చర్మంలోని వర్ణద్రవ్యం (మెలనిన్) అడ్డుకుంటుంది. అందుకే ముదురు రంగు చర్మం ఉన్నవాళ్లు ఇంకాస్త ఎక్కువసేపు ఎండలో ఉండటం మంచిది. రోజంతా పిల్లల్ని ఇంట్లోనే ఉంచకుండా ఆరుబయటా ఆడనివ్వాలి. పెద్దవాళ్లు కూడా వీలు కుదుర్చుకుని మరీ, స్నేహితులతో కబుర్లు చెప్పుకుంటూనో, వాకింగ్ చేస్తూనో ఎండలో గడపాలి.

# జంట స్వరాల వరకు వయొలిన్ నేర్చుకున్నాను

## పవర్ స్టార్ పవన్ కళ్యాణ్

### ఆస్కార్ విజేత కీరవాణితో పవన్ కళ్యాణ్ భేటీ

**టాకీస్:** ఆస్కార్ పురస్కార గ్రహీత, ప్రఖ్యాత సంగీత దర్శకులు ఎం.ఎం. కీరవాణి పై పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రశంసల జల్లు కురిపించారు. 'హరిహర వీరమల్లు' చిత్రంలోని "సలసల మరిగే నీలోని రక్తమే..." అనే పాటకు కీరవాణి తన సంగీత, సాహిత్యాలతో ప్రాణం పోశారని కొనియాడారు. ఈ గీతాన్ని రేపు (మే 21) విడుదల చేయనున్నట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. రోజుల నుంచి, దిగ్గజ గీత రచయితలు వేటూరి సుందరరామమూర్తి, సిరివెన్నెల సీతారామశాస్త్రితో తనకున్న అనుబంధం వరకు అనేక సంగీత, సాహిత్య విషయాలను కీరవాణి పంచుకున్నారని, ఆయన చెబుతుంటే సమయమే తెలియలేదని పవన్ పేర్కొన్నారు. కీరవాణి వద్ద ఉన్న వయోలిన్లను చూసి వాటి గురించి మాట్లాడుకున్నామని పవన్ తెలిపారు. ఆ సమయంలో తాను కూడా ఒకప్పుడు



"మనలోని పౌరుషం, వీరత్వం ఎప్పటికీ చల్లారకూడదని గుర్తుచేస్తూ, ప్రతి ఒక్కరినీ తట్టిలేపేలా 'సలసల మరిగే నీలోని రక్తమే...' పాటను కీరవాణి తీర్చిదిద్దారు," అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మనోధైర్యం కోల్పోకూడదని ఈ గీతం ఓ చురకలా అనిపించిందని ఆయన అభిప్రాయపడ్డారు. 'హరిహర వీరమల్లు' చిత్రానికి కీరవాణి అందించిన సంగీతం, నేపథ్య సంగీతం సినిమాలోని భావోద్వేగాలను అత్యున్నత స్థాయికి తీసుకెళతాయని పవన్ కళ్యాణ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సినిమా కోసం కీరవాణి ఎంతగా తపించారో తాను స్వయంగా చూశానని, 'వీరమల్లు'కి ఆయన ప్రాణం పోశారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని స్పష్టం చేశారు. "మీతో మొదటిసారి పనిచేస్తున్నాను, అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు, అందుకు తగ్గట్టే ఉండాలి కదా" అని కీరవాణి తనతో అన్న మాటలు ఆయన అంకితభావాన్ని తెలియజేస్తాయని పవన్ వివరించారు. తాను కీరవాణిని కలిసినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆ ఉదయం జరిగిన సంభాషణ ఎంతో సంతోషాన్నిచ్చిందని చెప్పారు. సంగీత దర్శకుడు చక్రవర్తి వద్ద శిష్యరికం చేసిన వయోలిన్ నేర్చుకున్న సంగతి, జంట స్వరాల వరకు నేర్చుకుని మధ్యలోనే వదిలేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నానని చెప్పారు. చిదంబరనాథన్ గారు బహూకరించిన వయోలిన్‌ను కీరవాణి ఎంత భద్రంగా దాచుకున్నారో తనకు చూపించారని పవన్ వివరించారు. కీరవాణికి తెలుగు కథలంటే ఎంతో ఇష్టమని, తనకు బాగా నచ్చిన 32 కథలతో ఓ సంకలనం కూడా సిద్ధం చేసుకున్నారని పవన్ వెల్లడించారు. ఆ కథల పుస్తకాన్ని కీరవాణి తనకు బహూకరించడం చాలా ఆనందాన్నిచ్చిందని అన్నారు. ఆ సంకలనంలో కీరవాణి స్వయంగా రాసిన రెండు కథలు కూడా ఉన్నాయని తెలిపారు. కీరవాణి కేవలం స్వరకర్త మాత్రమే కాదని, చక్కటి తెలుగు పదాలతో పాటలు రాయగల ప్రతిభావంతుడని, ఆయన రాసిన పల్లవులు గీత రచయితలకు మార్గనిర్దేశం చేస్తాయని పవన్ కొనియాడారు. తెరపై కనిపించే రెండున్నర గంటల సినిమా కోసం కీరవాణి రోజుల తరబడి, నెలల తరబడి తపన పడతారని పవన్ ప్రశంసించారు. తన సృజనాత్మక స్వరాలతో తెలుగు పాటకు ఆస్కార్ వేదికపై సముచిత స్థానం కల్పించిన ఘనత కీరవాణిదేనని ఆయన కీర్తించారు.




# 'రౌడీ జనార్దన్'తో కళావతి ఫిక్స్సైందా !

టాకీస్: కీర్తి సురేష్ నటిగా ఫుల్ బిజీగా ఉంది. తెలుగు, తమిళ్, హిందీ అంటూ మూడు భాషల్ని దున్నేస్తుంది. అవకాశం రావడం ఆలస్యం అనే మాటకు ఛాన్స్ ఇవ్వకుండా పనిచేస్తుంది. హీరోయిన్ రోల్ అయినా... సిస్టర్ రోల్ అయినా సరే మనసుకు నచ్చిందంటే కమిట్ అవుతుంది. బాలీవుడ్ లో వెబ్ సిరీస్ లు సైతం చేస్తుంది. ప్రస్తుతం 'అక్కా' అనే వెబ్ సిరీస్ లో బోల్డ్ గా నటిస్తుంది. పాత పద్ధతిలో వెళ్తే పనవ్వదని గ్రహించిన అమ్మడు రూట్ మార్చి గ్లామర్ పాత్రలకు సైతం సై అనడంతోనే ఇదంతా సాధ్యమైంది. టాలీవుడ్ లో అమ్మడు ఇంకా చాలా సినిమాలు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అక్కడా సిరీయస్ గానే ఫోకస్ చేస్తుంది. మహేష్, నాని లాంటి స్టార్ హీరోలతో సినిమాలు చేసింది. కానీ రామ్ చరణ్, ఎన్టీఆర్, బన్నీ లాంటి స్టార్లను మాత్రం ఇంకా అందుకోలేదు. వాళ్లతో ఛాన్స్ ఎప్పుడొస్తుందా..? అని ఎదురు చూస్తుంది. ఈ నేపథ్యంలో అమ్మడికి వాళ్లతో ఛాన్స్ రాకపోయినా విజయ్ దేవరకొండతో నటించే అవకాశం వచ్చింది. రవి కిరణ్ కోలా దర్శకత్వంలో విజయ్ హీరోగా ఓ సినిమా చేయనున్నాడు. ఈ చిత్రాన్ని దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఇందులో హీరోయిన్ గా కీర్తి సురేష్ ని తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో కీర్తి రోల్ రొమాంటిక్ గా ఉంటుందిట. హీరోతో లిప్ లాక్ సన్నివేశాలుంటాయని వినిపిస్తుంది. ఇప్పటి వరకూ కీర్తి ఏ హీరోతో లిప్ లాక్ వేయలేదు. 'సర్కారు వారి పాట'లో మహేష్ కి జోడీగా నటించింది. ఆ సినిమాతోనే అమ్మడు రొమాంటిక్ గేట్లు ఓపెన్ చేసింది. అందులో లిప్ లాక్ సన్నివేశాలకు సంబంధించి మూవ్ మెంట్స్ మాత్రమే ఇచ్చింది. రౌడీ జనార్ధన్లో మాత్రం రియల్ గానే లిప్ లాక్ వేసే వేస్తుందని విని పిస్తుంది. ప్రస్తుతం విజయ్ 'కింగ్ డమ్' పనుల్లో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా రిలీజ్ అనంతరం 'రౌడీ జనార్దన్' మొదలవుతుంది.




# రొమాంటిక్ థ్రిల్లర్ నేపథ్యంలో రీతూవర్మ దేవిక అండ్ డానీ వెబ్ సిరీస్

టాకీస్: యంగ్ హీరోయిన్ మన తెలుగు అమ్మాయి రీతూ వర్మ తన అందం, అభినయంతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. స్కిన్ షో కి దూరంగా కథకు ప్రాధాన్యమున్న పాత్రలే చేస్తూ దూసుకెళ్తున్నారు రీతూ. రీసెంట్‌గా త్రినాథరావు నక్కిన దర్శకత్వంతో సందీప్ కిషన్ హీరోగా తెరకెక్కిన 'మజాకా' మూవీ తో విజయం సాధించింది. ఇక ఇదే హిట్ జోష్‌లో రీతూ ప్రజంట్ 'దేవిక అండ్ డానీ' అనే రొమాంటిక్ అండ్ థ్రిలింగ్ వెబ్ సిరీస్‌తో రాబోతుంది. ఈ మధ్యకాలంలో థ్రిలింగ్ వెబ్ సిరీస్‌ను చూడాటానికి ప్రేక్షకులు బాగా ఆసక్తి చూపిస్తున్నారు. అందుకే రెటింగ్‌లో కూడా థ్రిలింగ్ చిత్రాలు ముందు స్థానంలో ఉంటున్నాయి. ఇందులో భాగంగా రీతు వర్మ నటిస్తున్న ఈ 'దేవిక అండ్ డానీ' అనే థ్రిలింగ్ వెబ్ సిరీస్‌ను జాయ్ ఫిల్మ్స్ ఈ సిరీస్ నిర్మించగా.. రీతు తో పాటుగా శివ కందుకూరి, సూర్య వశిష్ట, సుబ్బరాజు, మౌనికా రెడ్డి, సోనియా సింగ్, చాగంటి సుధాకర్, తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇక ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ ఎంతో ఆకట్టుకోగా తాజాగా ఈ సిరీస్‌కు సంబంధించిప ట్రైలర్ విడుదల చేశారు.ఇందులో రీతు వర్మ టీచర్ రోల్ లో డిఫరెంట్‌గా ఉండబోతున్నట్లు-తెలుస్తోంది. మొదట్లో కామెడీ నడిచి ఒక్కసారిగా వైలెన్స్ మొదలైంది.కానీ ఎక్కడ కూడా స్టోరీ లీక్ అవ్వకుండా ట్రైలర్ ను బాగా కట్ చేశారు. మొత్తానికి రొమాంటిక్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.

కాగా ఈ చిత్రం జూన్ 6 నుంచి డిస్నీ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది.


# వార్-2 గ్లింప్స్ విడుదల

**టాకీస్:** మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రస్తుతం బాలీవుడ్ మూవీ 'వార్ 2'లో నటిస్తున్న విషయం తెలిసిందే. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఎన్టీఆర్ మొదటిసారి బాలీవుడ్ సినిమాలో నటించనుండటంతో ఈ సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వచ్చిన వార్ సినిమాలో హృతిక్ రోషన్, -టైగర్ ష్రాఫ్ కలిసి నటించారు. ఈ రెండో భాగంగా తారక్ హృతిక్ తలపడనున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ చాలా వరకు పూర్తయ్యిందని తెలుస్తుంది. తాజాగా ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా వార్ 2 గ్లింప్స్ ను విడుదల చేశారు. ఈ మూవీ అప్ డేట్ కోసం తారక్ ఫ్యాన్స్ ఎప్పటినుంచో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ఎన్టీఆర్ కు బర్త్ డే విషెస్ తెలుపుతూ.. అదిరిపోయే వీడియోను విడుదల చేశారు. మొత్తనికి ఆగస్ట్ 14 న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## పట్టాలకెక్కిన తేజా సజ్జా మిరాయ్ మూవీ

**టాకీస్:** హనుమాన్ సినిమాతో హీరోగా తేజ సజ్జా మార్కెట్ ఎలా పెరిగిందో తెలిసిందే. దెబ్బకు మూడు వందల కోట్ల క్లబ్ లో జాయిన్ అయిపోయాడు. అయితే హనుమాన్ వచ్చి ఏడాది దాటిపోయింది. కానీ ఇంకో కొత్త మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకు రాలేకపోతున్నాడు. గత ఏడాది తేజ సజ్జా 'మిరాయ్' అనే ప్రాజెక్టుని ప్రకటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ



ప్రసాద్ నిర్మిస్తున్న ఈ యాక్షన్అడ్వెంచర్‌లో, తేజ సజ్జా సూపర్ యోధ పాత్రలో కనిపించనున్నాడు. ఇందులో భాగంగా తాజాగా ఈ మూవీ గురించి ఇంట్రస్టింగ్ అప్ డేట్ ఒకటి బయటకు వచ్చింది. నిర్మాత ముంబైలోని చారిత్రాత్మక గుహలలో సినిమా కొత్త షూటింగ్ షెడ్యూల్ ను ప్రారంభించాడు. తేజ సజ్జా తో పాటు-, కొంతమంది ప్రధాన పాత్రలు కూడా ఈ షెడ్యూల్ లో పాల్గొనబోతున్నారు. ఆగస్టులో విడుదల డేట్ అనుకోగా ఆ గడువుకు చేరుకోవడానికి సినిమాకు సంబంధించిన పనులు.. షెడ్యూల్ ప్రకారం స్పీడ్ గానే జరుగుతున్నాయి. ఇక రాకింగ్ స్టార్ మనోజ్ మంచు ప్రతినాయకుడిగా, రితికా నాయక్ కథానాయికగా నటించిన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా 8 వేర్వేరు భాషలలో 2డి మరియు 3డి ఫార్మాట్లలో గ్రాండ్ గా విడుదల అవుతుంది.

## ఎల్లమ్మ కోసం వేణు అష్టకష్టాలు

టాకీస్: ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన 'బలగం' సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందో చెప్పక్కర్లేదు. చిన్న పెద్ద తేడా లేకుండా పలేటూరు నుంచి బస్సులు కట్టుకొని వచ్చి మరీ ఈ మూవీని చూశారు ప్రేక్షకులు. మొత్తానికి ఇప్పటివరకు కమెడియన్‌గా ఉన్న వేణు.. మొదటి సినిమాతోనే ఒక ప్రత్యేక స్థానం నమ్మకం సంపాదించుకున్నాడు. దీంతో వేణు దర్శకుడిగా బిజీ అవుతాడని, బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తాడని అంతా అనుకున్నారు. కానీ..ఆయన 'ఎల్లమ్మ' అనే సినిమాను చేయాలనే సంకల్పంతో గత ఏడాది కాలంగా అదే స్క్రిప్ట్‌తో హీరోల చుట్టూ తిరుగుతున్నట్లు-తెలుస్తోంది. ముందుగా ఈ కథను నానికి వినిపించాడని, ఆయన ఆసక్తి చూపించినప్పటికి ఫైనల్ వర్షన్ నచ్చక పోవడంతో సున్నితంగా తిరస్కరించారట. దాంతో ఈ కథ తో శర్వానంద్ వద్దకు వేణు వేళ్లారట. ఆయన సైతం తిరస్కరించారని తెలుస్తోంది. హనుమాన్ హీరో తేజ సజ్జా ఆసక్తి చూపించినా, ఇతర కమిట్‌మెంట్స్ వల్ల ఇప్పట్లో చేయలేను అన్నారట. దీంతో ఫైనల్‌గా నితిన్ వద్దకు



చేరుకుంది. ఆయన పూర్తి కథ విన్న తర్వాత ఓకే అన్నారు, త్వరలోనే ఒప్పందాలు సైతం పూర్తి అవ్వబోతున్నాయట. ఇందులో భాగంగా తాజాగా వేణు ఈ మూవీకి సంబంధించిన అప్ డేట్ ఇచ్చారు.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 'ఎల్లమ్మ' అంటూ స్క్రిప్ట్ బుక్ పట్టుకుని పిక్ షేర్ చేశాడు వేణు. మొత్తానికి గట్టిగా ప్లాన్ చేశాడు. రెండో సినిమా కూడా భారీ విజయం సాధించేలా ఉంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజ్ ఈ సినిమాను తన బ్యానర్‌లో నిర్మిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.